RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 | సంచిక : 139 | శుక్రవారం, జూలై 5, 2024 | పేజీలు : 4

### నిలకడగా అద్వానీ ఆరోగ్య పరిస్థితి..

న్యూఢిల్లీ: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఆయన ప్రస్తుతం అపోలో ఆసుపత్రి వైద్యుల బృందం పర్యవేక్షణలో ఉన్నారు. అద్వానీ నిన్న జూలై 3 రాత్రి అనారోగ్యంతో న్యూఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేరగా.. అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అపోలో ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కాగా, ప్రస్తుతం ఆయన న్యూరాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినిత్ సూరి పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

### జార్ఖండ్ సిఎంగా హేమంత్ సోరెన్

## ప్రమాణస్వీకారం



జార్ఖండ్ సిఎంగా మళ్లీ హేమంత్ సోరెన్ ప్రమాణస్వీకారం చేశారు. గురువారం రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, హేమంత్ సోరెన్ చేత ప్రమాణం చేయించారు. భూకుంభకోణం కేసుకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఈ ఏడాది జనవరిలో హేమంత్ సోరెన్‌ను ఇడి అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అరెస్టుకు ముందు ఆయన సిఎం పదవికి రాజీనామా చేశారు. దీంతో చంపయి సోరెన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదల అయ్యారు. 5 నెలలుగా జైలులో ఉన్న హేమంత్ సోరెన్.. మళ్లీ జార్ఖండ్ సీఎంగా ప్రమాణం చేశారు.

### నీట్ యుజి పరీక్షను రద్దు చేయకుండా అడ్డుకోండి

## సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: వివాదాస్పద నీట్ యుజి పరీక్షను రద్దు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)కి ఆదేశాలు జారీచేయాలని కోరుతూ నీట్ పరీక్షలో ఉన్నత సాధించడంతోపాటు ఫస్ట్ ర్యాంకు పొందిన గుజరాత్‌కు చెందిన 50 మందికి పైగా అభ్యర్థులు గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఏడాది మే 5న జరిగిన నీట్ యుజి పరీక్షలో పేపర్ లీకేజీ వంటి అక్రమాలకు పాల్పడిన విద్యార్థులు, ఇతరులపై దర్యాప్తు చేసి, దోషులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవలసిందిగా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖను ఆదేశించాలని వారు సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీట్ యుజి పరీక్షను రద్దు చేయాలని, తిరిగి పరీక్ష నిర్వహించాలని కోరుతూ దాఖలైన 26 పిటిషన్లపై జులై 8న చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టడానికి కొది రోజుల ముందు గుజరాత్‌కు చెందిన 56 మంది అభ్యర్థులు ఈ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబిబిఎస్, బిడిఎస్, ఆయుష్



తదితర వైద్య కోర్సులలో ప్రవేశాల కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్(నీట్) యుజి పరీక్షను ఎన్‌టిఎ నిర్వహిస్తుంది. ఈ ఏడాది మే 5న 4,750 సెంటర్లలో నీట్ యుజి పరీక్ష నిర్వహించగా దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

### సీఎం రేవంత్ రెడ్డి షరతులపై స్పందించిన

## ఫిల్మ్ ఛాంబర్




హైదరాబాద్: ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి టాలీవుడ్‌కి కీలక సూచనలు చేశారు. సినిమాల్లో డ్రగ్స్ వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా వీడియోలు రూపొందించాలన్నారు. అలా చేయని సినిమాలకు టికెట్ ధరలు పెంచే ప్రసక్తే లేదన్నారు. వందల కోట్ల బడ్జెట్ తో తెరకెక్కుతున్న సినిమా అయినప్పటికీ సైబర్ క్రైమ్, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలంటూ... సినిమా కంటే ముందు కానీ సినిమా తరువాత 3 నిమిషాలు వీడియోతో అవగాహన కల్పించాలని చెప్పారు.

కాగా, ఈ అంశం పై తెలుగు ఫిలిం ఛాంబర్ స్పందించింది. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణ వంటి విషయాలలో చలన చిత్ర పరిశ్రమ ముందుండి ప్రభుత్వానికి అండగా ఉందనే విషయాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపింది. ఈ విషయం పై చలన చిత్ర పరిశ్రమకు సంబంధించిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్స్ యాజమాన్యాలు.. డ్రగ్స్, సైబర్ నేరాలను అరికట్టడానికి తమవంతు భాధ్యత నిర్వర్తించడానికి ఇకపైన కూడా ఎల్లవేళలా తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటుంది. దీనిపై అతి త్వరలో సీఎంను కలవనున్నట్లు తెలిపింది.

### తెలంగాణ నిఘా విభాగాలకు...

## నిధులు కేటాయించండి

### కేంద్ర హెూం మంత్రి అమిత్ షాకు రేవంత్ వినతి



ఢిల్లీ: రాష్ట్ర స్థాయి అత్యున్నత నిఘా విభాగాలైన తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ) ఆధునీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర హెూం శాఖ మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కలిశారు. సుమారు గంటపాటు కొనసాగిన భేటీలో వివిధ అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. భేటీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. డ్రగ్స్ మరియు సైబర్ నేరాల నియంత్రణతో పాటు అరికట్టడానికి కావల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల కొనుగోలు కోసం టీజీ న్యాబ్‌కు రూ.88 కోట్లు, టీజీ సీఎస్‌బీకి రూ.90 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి కోరారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఐపీఎస్ క్యాడర్ సమీక్ష చేయడం తప్పనిసరని, తెలంగాణకు సంబంధించి 2016లో మొదటి సారి సమీక్ష నిర్వహించారని, నాటి నుంచి సమీక్ష చేయనుందున వెంటనే సమీక్ష చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు 61 ఐపీఎస్ పోస్టులు కేటాయించారని, కొత్త రాష్ట్ర అవసరాలకు ఐపీఎస్‌లు సరిపోనందున, తెలంగాణకు అదనంగా మరో 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో సెక్యూరిటీ ఫోర్స్ క్యాంపులు ఏర్పాటు చేసిన విషయాన్ని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

### రాష్ట్ర అభివృద్ధిపై...

## ప్రధాని మోడీని కలిశాం


న్యూఢిల్లీ: రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్రమంత్రులను కలిశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. గురువారం ఢిల్లీలో ప్రధాని మోడీతో సిఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడిన సిఎం.. రాష్ట్ర అభివృద్ధికి సహకిరించాలని కోరినట్లు చెప్పారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు ఉంటాయన్నారు. రాజకీయాలకు అతీతంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు కొనసాగించాలనే ఆలోచనతోనే ప్రధాని, కేంద్రమంత్రులను కలిశామన్నారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కనరించాలని వినతిపత్రాలు ఇచ్చామని చెప్పారు. ప్రధాని మోడీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. విభజన హామీల పరిష్కారించాలని కేంద్ర హెూంశాఖ చొరవ తీసుకోవాలని కోరినట్లు సిఎం రేవంత్ తెలిపారు. అనంతరం మాట్లాడిన డిప్యూటీ సిఎం భట్టి.. తెలంగాణకు ఐఐఎం ఇవ్వాలని, ఐటీఆర్



ప్రాజెక్టును పునరుద్ధరించాలని ప్రధాని మోడీని కోరామన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. గోదావరి పరిసరాల్లోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని, వేలం లేకుండా సింగరేణికి బొగ్గు గనులను కేటాయించాలని కోరామని ఆయన చెప్పారు.

## జులై 8న రష్యాకు ప్రధాని మోడీ పయనం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 8, 9 తేదీలలో రష్యాను సందర్శించనున్నారు. 22వ భారత్-రష్యా వార్షిక సదస్సులో ఆయన పాల్గొని ఉభయ దేశాల మధ్య కొనసాగుతున్న బహుముఖ సంబంధాలను సమీక్షించనున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ(ఎంఇఎ) గురువారం ప్రకటించింది. రష్యా పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోడీ ఆస్ట్రియాకు పయనమవుతారని ఎంఇఎ తెలిపింది. గడచిన 41 సంవత్సరాలలో భారత ప్రధాని ఆస్ట్రియాను సందర్శించడం ఇదే మొదటిసారి. గత ఐదేళ్లలో రష్యాను సందర్శించడం మోడీకి ఇదే మొదటిసారి. 2019లో ఆయన చివరిసారి రష్యాను సందర్శించారు. రష్యాలోని వ్లాదివోస్తోక్ నగరంలో జరిగిన ఆర్థిక సదస్సులో ఆయన పాల్గొన్నారు. రష్యా, భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై రెండు దేశాల అగ్నేతలు చర్చలు జరిపే ప్రధాన వేదికగా వార్షిక సదస్సును పరిగణిస్తారు. ఇప్పటి వరకు 21సార్లు వార్షిక సదస్సులు భారత్, రష్యాలో ఒవ దేశం తరువాత మరో దేశంలో జరుగుతున్నాయి. 2021 డిసెంబర్ 6న న్యూఢిల్లీలో జరిగిన 21వ వార్షిక సందస్సులో రష్యా



అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైన తర్వాత మొదటిసారి భారత ప్రధాని మోడీ రష్యాను సందర్శించనుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రష్యా నుంచి ప్రధాని మోడీ ఆస్ట్రియా వెళతారు. జులై 9, 10 తేదీలలో ఆయన ఆస్ట్రియాలో ఉంటారు. ఆస్ట్రియా రిపబ్లిక్ అధ్యక్షుడు అలెక్జాండర్ వాన్ డెర్ బెలెన్‌తో ప్రధాని మోడీ భేటీ అవుతారు. ఆస్ట్రియా చాన్సలర్ కార్ల్ నెహమ్మర్‌తో కూడా మోడీ చర్చలు జరుపుతారని ఎంఇఎ తెలిపింది.

## ఆప్‌తో కాంగ్రెస్‌కు పొత్తు ఉండే అవకాశం లేదు: జైరాం రమేష్

న్యూఢిల్లీ: హర్యానా, ఢిల్లీలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మధ్య పొత్తు ఉండే అవకాశం కనపడడం లేదని, అయితే మహారాష్ట్ర, జార్ఖండ్‌లో మాత్రం ఇండియా కూటమి కలసికట్టుగా ఎన్నికలను ఎదుర్కొంటుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ గురువారం వెల్లడించారు. రాష్ట్రాలకు చెందిన అసెంబ్లీ ఎన్నికలలో ఏక సూత్రాన్ని ఇండియా కూటమి పాటించబోదని పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, ఇతర మిత్రపక్షాల నాయకుల మధ్య అంగీకారం కుదిరిన రాష్ట్రాలలో ఇండియా కూటమి సమైక్యంగా పోటీ చేస్తుందని ఆయన అన్నారు. ఇండియా కూటమి ఏ రాష్ట్రాలలో ఎన్నికల పొత్తు కుదుర్చుకుంటుందన్న ప్రశ్నకు జార్ఖండ్, మహారాష్ట్రలో పొత్తు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పంజాబ్‌లో ఇండియా కూటమి మధ్య పొత్తు లేదని ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికలలో హర్యానాలో ఆప్‌కు ఒక సీటు కేటాయించామని, అయితే అసెంబ్లీ ఎన్నికలలో పొత్తు ఉండే అవకాశం లేదని ఆయన చెప్పారు.



## దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయండి

### సిద్దరామయ్యకు ఎడియూరప్ప సవాలు

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు బిజెపి అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి బిఎస్ ఎడియూరప్ప సవాలు విసిరారు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే బిజెపి 140 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం బిజెపి రాష్ట్ర ప్రత్యేక కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ కర్నాటక ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నిరుపయోగ హామీలు, ధన బలం, కండబలాన్ని వ్యతిరేకించారని, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని గెలిపించారని చెప్పారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని, అప్పుడే మీ పరిస్థితి ఏమిటో మీకు తెలుస్తుందని ఎడియూరప్ప అన్నారు. కర్నాటక అసెంబ్లీ సంఖ్యాబలం 224 కాగా లోక్‌సభ స్థానాల సంఖ్య 28.



## సంపాదకీయం

# యుగ పురుషుడు... వివేకానందుడు.....!

భారతదేశ సంస్కృతిని, ఆధ్యాత్మిక చింతనను, విదేశాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద. ఉపన్యాసాల ద్వారా భారత యోగ, వేదాంత శాస్త్రాలను ఖండాంతరాలు దాటించిన వ్యక్తి ఆయన. అమెరికాలోని చికాగోలో, ఇంగ్లాండులో ఆనాడు చేసిన ఆయన ప్రసంగాలను భారత సమాజం గర్వంగా గొప్పగా నేటికీ గుర్తు చేసుకుంటునే ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో అడుగు పెట్టిన తొలి హిందూ సన్యాసి కూడా వివేకానందనే కావడం విశేషం. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం'... 'లేవండి..మేల్కోండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి' వంటి వివేకానంద సూక్తులు ఇప్పటికీ ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన వివేకానందుని వ్యక్తిత్వాన్ని ఆయన జయంతి సందర్భంగా భారతీయులు ఏటా స్మరించుకుంటున్నారు. ఆయన సేవలను స్మరిస్తూ భారత ప్రభుత్వం వివేకానంద జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుతోంది. స్వామి వివేకానంద 1863 సంవత్సరం జనవరి 12 తేదీన మకర సంక్రాతి రోజున ఒక బెంగాలీ కుటుంబంలో కలకత్తాలో జన్మించారు. జులై 4, 1902న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. చిన్న వయసులోనే ఎన్నో పాశ్చాత్య , తత్వ శాస్త్ర గ్రంధాలు, నవలలు, చరిత్రలు, అన్ని మతాల గ్రంధాలు, ఇలా ఎన్నో చదివే వారు. జీవించింది కేవలం 39 సంవత్సరాలే కానీ శతాబ్దాల పాటు చెరిగిపోని ముద్ర వేశారు. తూర్పు మరియు పశ్చిమ సంస్కృతుల మధ్య ఒక వారధి నిర్మించారు. మన దేశానికి ప్రపంచ దేశాల్లో గౌరవం తెచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన జీవితం మొత్తం మీద తనకంటూ చేసుకున్నది, దాచుకున్నది ఏది లేదు. ఆయన విదేశాలలో ఎలాంటి ముద్ర వేశారంటే ఇప్పటికి అమెరికాలో ఒక వీధికి "స్వామి వివేకానంద స్ట్రీట్" అని పేరు పెట్టుకున్నారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. మహాత్మా గాంధీ , సుభాష్ చంద్రబోస్, లోకమాన్య తిలక్, బిపిన్ చంద్ర పాల్ వంటి ఎంతోమంది స్వాతంత్ర యోధులకు వివేకానందుడే ఆదర్శం. . "మీరు ఇండియా గురించి తెలుసు కోవాలను కుంటే స్వామి వివేకానంద గురించి చదవండి" అన్నారు విశ్వకవి టాగోర్. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి తద్వారా భారతీయ యువతకు దిశా నిర్దేశం చేశారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని, యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే "డబ్బు లేని వాడు కాదు... జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు" అనే వారు వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా "గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతకమని" దేనికి భయపడవద్దని చెపుతుండే వారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను" అని స్వామీజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను "నేషనల్ యూత్ డే" గా జరుపు కుంటారు. ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్ధేశం చేశారు. వ్యక్తి విజయవంతమైన జీవితం గడపడానికి కొన్ని సూత్రాలను వివేకానందుడు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావనలతో వ్యక్తిలో నిస్వార్ధమైన వైఖరులు ఏర్పడతాయని వివరించారు. సుఖదు:ఖాలు నాణేనికి రెండు పార్శ్వాలు లాంటివి. కాబట్టి సానుకూల దృక్పథంతో ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు ఏడుస్తూ కూర్చుంటే సమయం వృథా అవుతుందే తప్ప ప్రయోజనం ఉండదు. విశ్వంలో ప్రతి అంశం తార్కిక ఆలోచనలతో ముడిపడి ఉంటుంది. కాబట్టి తార్కిక ఆలోచనలతో ప్రపంచాన్ని అవగాహన చేసుకోడానికి ప్రయత్నించాలి. ఎవరి సామర్థ్యంపై వారికి నమ్మకం ఉండాలి. ఇతరులపై ఆధారపడే విధానానికి స్వస్తి పలకాలి. మందలో ఉండకు ..వందలో ఉండటానికి ప్రయత్నించు..ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు. కెరటం నాకు ఆదర్శం... లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు. మతం అనేది సిద్దాంత రాద్ధాంతాలలో లేదు... అది ఆచరణలో ఆధ్యాత్మికులుగా పరిణతి చెందడంలో మాత్రమే ఉంది. ఈ ప్రపంచం బలవంతులకు మాత్రమే సహాయ పడుతుంది.. ఇలా యువతకు వివేకానందుడు స్ఫూర్తిని కలిగించే ప్రయత్నం చేశారు. జీవితం నిరాశ నిస్పృహలతో నిండిపోయి నప్పుడు, భయ భ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమి చెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు స్వామి వివేకానందకు సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవాలి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగుతుంది. జీవితానికి అసలైన అర్థం తెలుస్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహనీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు.

# రేవంత్ జిల్లాల బాట



**మహబూబ్ నగర్:** రేవంత్ జిల్లాల బాట పట్టేందుకు రెడీ అవుతున్నారు. మొన్నటి వరకు ఎన్నికలు.. దాని కారణంగా వచ్చిన ఎలక్షన్ కోడ్. దీని వల్ల అనేక ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు ఆ హడావుడి అంతా ముగిసింది. కాబట్టి.. పాలనపై ఫుల్ ఫోకస్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలేంటి అనే దానిపై అధికారులతో చర్చలు జరుపుతున్నారు. అంతేకాదు.. అధికారులు తమ తీరును మార్చుకోవాలంటూ కొంచెం సీరియస్‌గానే క్లాస్ తీసుకున్నారు రేవంత్. దీనికి సంబంధించి అన్ని డిపార్ట్‌మెంట్‌ల కార్యదర్శులతో నిర్వహించిన భేటీలో చాలా కీలక సూచనలతో పాటు.. కొన్ని ఆదేశాలను కూడా జారీ చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు కొత్త కార్యక్రమాల గురించి ఆలోచించాలి. వినూత్న ఆలోచనలను ఎప్పటికప్పుడు నేరుగా సీఎంవోతో పంచుకోవాలి. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలి. ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలి. సమయపాలన తప్పనిసరిగా పాటించాలి. కేవలం ఆఫీసులకు పరిమితం అవ్వడం కాకుండా.. తమ డిపార్ట్‌మెంట్ పనితీరును పర్యవేక్షించేందుకు వారానికి ఒక రోజు ఖచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి. నెలకోసారి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసుకోవాలి. అసలేం పనులు జరుగుతున్నాయి? వాటి పురోగతి ఎక్కడి వరకు వచ్చింది? ఇలా ప్రతి విషయాన్ని పరిశీలించాలి. ఇవీ సీఎం రేవంత్ అధికారులకు ఇచ్చిన ఆదేశాలు. అక్కడితో అయిపోయిందా..? కాలేదు. ఇవీ సెక్రటేరియట్‌లో ఉండే ఉన్నతాధికారులకు కూడా వర్తిస్తాయి. ఆ తర్వాత జిల్లాల కలెక్టర్ల వంతు. అసలు జిల్లాల్లో కలెక్టర్లు ఆఫీస్ దాటుతున్నారా? అని డైరెక్ట్‌గానే క్వశ్చన్ చేశారు. కలెక్టర్లు కూడా గ్రౌండ్ లెవల్‌లో పర్యటించాలి. హాస్పిటల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్స్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూషన్స్‌ను ఎప్పటికప్పుడు సందర్శించాల్సిందే. వ్యక్తుల ఇష్టాలకు అనుగుణంగా కాదు.. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లిపోయాయి. అంతేకాదు సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావొద్దని.. సీఎంవో ఇచ్చే సలహాలు, సూచనలను పాటించాలని కూడా చెప్పారు. మరి అందరూ అధికారులకు చెప్పారు. మరి మీ సంగతేంటి అని ఎవరు అడగకముందే.. సీఎం రేవంత్ మరో విషయాన్ని క్లారిటీ ఇచ్చారు. అతి త్వరలోనే తాను కూడా వారానికో జిల్లా పర్యటనకు వెళ్తానన్నారు రేవంత్. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలను స్వయంగా పరిశీలిస్తానంటున్నారు రేవంత్. అధికారులను, స్థానిక ప్రజలను కలుసుకునేలా తన పర్యటన ఉంటుందన్నారు. కాబట్టి.. అధికారుల తీరు ఎలా ఉందన్నది నేరుగా ప్రజల వద్ద నుంచే ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నారు రేవంత్ అని దీన్ని బట్టి అర్థమవుతోంది. నిజానికి పాలన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి రూటే సపరేట్ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎందుకంటే గత పదేళ్లుగా తెలంగాణలో పాలన విధానం చూసిన వారికి ఇది కొత్త విషయమే. బీఆర్ఎస్ పాలనలో అధికారం మొత్తం ఏకఛత్రాదిపత్యంగా ఉండేది. పేరుకు అధికారులు ఉన్నా.. అధికారం మాత్రం కొందరి చేతుల్లోనే ఉండేదన్న విషయం అందిరికీ తెలిసిందే.. సామాన్య అధికారులను పక్కన పెడితే ఎమ్మెల్యేలకే సీఎంతో కలిసి మాట్లాడే చాన్స్ లేకుండా ఉండేది. పర్యవేక్షించేవారే లేకపోవడంతో ఉన్నతాధికారులు కార్యాలయాలు దాటకపోయేవారు. వారిని చూసి కిందిస్థాయి అధికారులు కూడా నిమ్మకు నీరెత్తకుండా వ్యవహరించేవారు. కానీ ఇదంతా గతం అంటున్నారు రేవంత్ రెడ్డి. నిద్రాణంగా ఉన్న అధికారవ్యవస్థ ఇక పరుగులు పెట్టాల్సిన సమయం వచ్చిందని చెబుతున్నారు. అధికారులు అలర్ట్‌గా ఉన్నారా? లేదా? అనేది కూడా స్వయంగా తానే పరిశీలించేందుకు సిద్ధమయ్యారు రేవంత్ రెడ్డి.

# మూతబడిన పాఠశాలలపై దృష్టి

**హైదరాబాద్:** పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ తీవ్ర అవస్థలపాలయింది. తెలంగాణ వస్తే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని ప్రసంగాలతో ఊదరకొట్టిన నాటి బీఆర్ ఎస్ నాయకులు బాల్యం నిర్వీర్యం అయిపోతుంటే చోద్యం చూశారే తప్ప రాష్ట్ర విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు. విద్యావ్యవస్థను గాడిలో పెట్టామని గోడలకు రంగులు వేసి కరపత్రాలు ముద్రించుకుని మురిపోయారు నాటి బీఆర్ఎస్ నేతలు. తెలంగాణలో 28 వేల పైచిలుకు పాఠశాలలు ఉండగా అందులో ఇప్పటికీ సగానికిపైగా పాఠశాలలు మూసి వేయబడ్డాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కార్ తక్షణ చర్యలు తీసుకోకపోతే కొత్తగా మరికొన్ని మూతబడే ప్రమాదం ఉంది. మూతబడిన ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ తిరిగి తెరిపించాలని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలను విద్యాశాఖ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. విద్యార్థులు లేక మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ నీటి మూటగానే మిగిలింది. తాజాగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న వాటికి కేటాయించనేలేదు. విద్యార్థులున్న పాఠశాలలకే ఉపాధ్యాయులను కేటాయిస్తూ వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పది మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలకు ఒకరు, 11 నుంచి 40 మంది వరకు ఉన్న పాఠశాలలకు ఇద్దరు, 41 నుంచి 60 మంది ఉన్న పాఠశాలలకు ముగ్గురు, 61, ఆపైన విద్యార్థులున్న పాఠశాలలకు మంజూరైన అన్ని పోస్టులను భర్తీ చేసేలా వెబ్ ఆప్షన్లను కేటాయించింది. తాజా ప్రకటనతో ముఖ్యమంత్రి హామీ ఇప్పట్లో అమలయ్యేలా లేదని తేలింది. రాష్ట్రంలో మూతపడిన ప్రభుత్వ బడులను తెరిపిస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ బడులను తెరిపించేందుకు ఉపాధ్యాయులను కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో విద్యార్థులు లేక (జీరో ఎన్‌రోల్‌మెంట్) మూతపడిన 1,739 ప్రభుత్వ పాఠశాలలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెరుచుకుంటాయని ప్రజలు ఆశించారు. కానీ, ఆ పాఠశాలలకు తాజాగా ఒక్క ఉపాధ్యాయుడినీ ప్రభుత్వం కేటాయించలేదు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి మండలంలో ఖాజాగూడ, మంచర్లగూడ



పాఠశాలలు మూతబడి దశాబ్ద కాలం గడుస్తున్నది. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు చేసేదేమీ లేక తమ పిల్లలను అప్పో సప్పో చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూతబడిన అన్ని పాఠశాలలను తిరిగి తెరిపించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా.. ఇప్పటికే శంకర్పల్లి మండలంలో మూతబడిన లక్ష్మారెడ్డి గూడ ప్రాథమిక పాఠశాల, లచ్చిరెడ్డి గూడ, కచ్చిరెడ్డి గూడ గ్రామాల్లో విద్యాశాఖ అధికారులు పాఠశాలలను తెరిపించారు. కాగా, పాఠశాలలు తెరిచి 15 రోజులు గడుస్తున్నా మండలంలో ఇంకా ఖాజాగూడ, మంచర్లగూడ పాఠశాలలు తెరుచుకోలేదు. ఖాజా గూడ గ్రామస్తులు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల తెరుచుకోకపోవడంతో తమ పిల్లలను సమీపంలోని ఎలవర్తి గ్రామానికి పంపించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో మూతబడిన పాఠశాలలను తెరిపిస్తుండగా, తమ గ్రామంలో ఎందుకు తెరిపించడం లేదని ఖాజాగూడ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మూతబడిన ఖాజాగూడ, మంచర్లగూడ పాఠశాలలు తెరిపించే విషయమై సంప్రదించేందుకు శంకర్పల్లి ఇన్చార్జి ఎంఈవో సయ్యద్ అక్బర్‌కు ఫోన్ చేస్తే.. ఆయన స్పందించకపోవడం గమనార్హం.

# బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్: తెలంగాణ ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆర్థికశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జులై 5వ తేదీ నుంచి 20 వరకు బదిలీల షెడ్యూల్ ప్రకటించింది. 2024 జూన్ 30 నాటికి ఒకే చోట నాలుగేళ్లుగా పనిచేస్తో?న్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆదేశించింది. ఒకేచోట రెండేళ్లు పూర్తి కాని ఉద్యోగులను ట్రాన్స్ ఫర్ చేయొద్దని జీవోలో పేర్కొంది. కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగులను బదిలీ ప్రక్రియ చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్లు, వితంతువులు, భార్యభర్తలు(స్పౌజ్) లకు బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. ఉద్యోగులకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి, ఆప్షన్లను స్వీకరించి బదిలీలు చేయనున్నారు. ఈ నెల 5 నుంచి 8 వరకు ఉద్యోగ సంఘాలతో బదిలీలపై చర్చించి వివరాలను ప్రకటించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. జులై 9 నుంచి 12వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగుల నుంచి ఆప్షన్లు స్వీకరించనున్నట్లు ప్రకటించింది. జులై 13 నుంచి 18 వరకు ఉద్యోగుల బదిలీల అప్లికేషన్లు పరిశీలించనున్నారు. జులై 19, 20 తేదీల్లో ఉద్యోగుల బదిలీలపై ఉత్తర్వులు జారీ చేయనున్నారు. అలాగే ఈ నెల 21 నుంచి ఉద్యోగుల బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుందని ఆర్థికశాఖ ప్రకటించింది. ఒకరి కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఒకే చోటకు ట్రాన్స్ ఫర్ ఎంచుకుంటే అధికారులు ప్రాధాన్యత క్రమం మేరకు నిర్ణయం తీసుకుంటారని ఆర్థిక జీవోలో పేర్కొంది. ఈ కింద విధానంగా అధికారులు బదిలీలకు ప్రాధాన్యత ఇస్తారు. భార్యాభర్తల బదిలీలు( ఇద్దరిలో ఒకరు మాత్రమే బదిలీ అవుతారు). జూన్ 30, 2025లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులు బదిలీలు పెట్టుకుంటే వారికి అవకాశం కల్పిస్తారు. 70% లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన ఉద్యోగుల బదిలీమెంటల్లీ రిటార్డెడ్ పిల్లలను కలిగి ఉన్న ఉద్యోగులు వైద్య సదుపాయాలు అందుబాటులో ప్రదేశాలకు బదిలీ అయ్యేందుకు వీలు కల్పిస్తారు. వితంతువులు. పలు వ్యాధులకు సంబంధించిన వైద్యపరమైన కారణాలు (స్వయంగా లేదా జీవిత భాగస్వామి లేదా పిల్లలు లేదా తల్లిదండ్రులు) చికిత్స కోసం సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రదేశాలకు బదిలీ చేస్తారు. ఈ కింది క్రమంలో ప్రాధాన్యత ఇస్తారు.

1. క్యాన్సర్
2. న్యూరోసర్జరీ
3. కిడ్నీ మార్పిడి
4. కాలేయ మార్పిడి
5. ఓపెన్ హార్ట్ సర్జరీ
6. బోన్ టీబీ

కష్టతరమైన ప్రదేశాల్లో ఎక్కువగా కాలంగా పనిచేస్తున్న ఉద్యోగులను గుర్తించి , వారి బదిలీలకు అవకాశం కల్పిస్తారు. వ్యక్తిగత లేదా వైద్య కారణాల బదిలీపై ఉన్నతాధికారులు వెరిఫై చేస్తారు. ఈ కారణాలను ప్రభుత్వానికి రిపోర్టు చేస్తారు.

# కువైట్ అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందచేత - మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం:** కువైట్ అగ్ని ప్రమాదం లో మరణించిన కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి చేరో ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని అందించి భరోసా కల్పించడం జరిగిందని రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు గురువారం స్థానిక గోదావరి బండ్ వద్ద నిర్వహించిన అల్లూరి జయంతి వేడుకల సందర్భంలో బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి చెక్కును అందచేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ఇటివల కువైట్ దేశంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన జిల్లాకు చెందిన ముల్లేటి సత్యనారాయణ , మిసాల ఈశ్వరుడు కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా కలిసి, మృతులకి నివాళులు అర్పించడం జరిగిందన్నారు. జూన్ 12 న కువైట్ లోని ఏడు అంతస్తుల భవనంలో ని వంట గదిలో జరిగిన ప్రమాదంలో మృత్యు వాత పడినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లి మనోధైర్యం కల్పించాలని పేర్కొనడం జరిగిందని , వారి ఇంటికి స్వయంగా వెళ్ళి పరామర్శించి , ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చామన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడి బాధిత కుటుంబాలకు చేరో ఐదు లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిన చెక్కులని అంద చేశామన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ఆకుటుంబాలని మంత్రి భరోసా కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ముల్లేటి సత్యనారాయణ సతీమణి అనంతలక్ష్మి తరపున కుమారుడు వెంకట సాయి కి , మిసాల ఈశ్వరుడు భార్య చిట్టి కాసులకి మంత్రి కందుల దుర్గేష్ , కలెక్టర్ పి. ప్రశాంతి, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ల చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చెక్కును అందచేసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి కందుల దుర్గేష్ కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. పెరవలి మండలం ఖండవిల్లి గ్రామానికి చెందిన మృతుడు ముల్లేటి సత్యనారాయణ సతీమణి అనంతలక్ష్మి తరఫున కుమారుడు వెంకట సాయి మంత్రి చేతుల మీదుగా రూ.5 లక్షల చెక్కు అందుకున్నారు.

# అల్లూరి జీవితం అందరికి ఆదర్శ ప్రాయం: కమిషనర్ అదితిసింగ్

**తిరుపతి:** అల్లూరి సీతారామరాజు జీవితం అందరికి ఆదర్శ ప్రాయమని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం అల్లూరి చిత్రపటానికి పూలమాలతో అలంకరించి, అధికారులు, కార్పొరేటర్లు కొబ్బరి కాయలు కొట్టి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ అదితిసింగ్ ఐఏఎస్ మాట్లాడుతూ మన్యం ప్రజల స్వాతంత్ర్య కోసం బ్రిటీష్ వారిపై పోరాడిన అల్లూరి స్ఫూర్తిని అందరూ గుర్తుంచుకున్నారని, స్వాతంత్ర్య కోసం పోరాడిన మహానుభావులను స్మరించుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్పొరేషన్ ఉధ్యోగస్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తిరుపతి నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జయంతిని మనమంతా స్మరించుకోవడం సంతోషమని, ఈ సందర్భంగా కమిషనర్ గారికి విజ్ఞప్తి చేస్తూ అల్లూరి సీతారామరాజు విగ్రహం తిరుపతి నగరంలో లేదని, ఆయన విగ్రహం ప్రతిష్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆర్.సి.మునికృష్ణ, కోటూరి ఆంజినేయులు, వరికుంట్ల నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, రెవెన్యూ ఆఫిసర్లు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫిసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రులతో భేటీ అయిన ఆళ్లగడ్డ యువ శిల్పి బాలు

- అమెరికాలో భద్రాద్రి రామాలయం ప్రతిష్టించేందుకు తోడ్పాటు అందించాలి
- ప్రముఖ శిల్పి దురుగడ్డ బాలసుబ్రమణ్యం వినతి

వాణి బాలసుబ్రమణ్యం శిల్పకళా మందిరంలో భద్రాద్రి రామాలయం నిర్మాణం పూర్తయి అమెరికా దేశంలోని అట్లాంట నగరంలో ప్రతిష్టించేందుకు కేంద్ర మంత్రుల సహాయ సహకారాలను కోరినట్లు శ్రీ వాణి బాలసుబ్రమణ్యం శిల్పకళా మందిరం శిల్పాచార్యులు ప్రముఖ శిల్పి దూరు గడ్డ బాలసుబ్రమణ్యం ఆచారి తెలిపారు. ఈ సందర్భంగా ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ ళ్లగడ్డ వాణి బాలసుబ్రమణ్యం శిల్పకళా మందిరం వ్యవస్థాపకులు యువ శిల్పి దురుగడ్డ బాల సుబ్రహ్మణ్యం ఆచారి గురువారం ఢిల్లీలో కేంద్ర మైనింగ్ శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ లతో భేటీ అయ్యారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తమ శిల్పకళా మందిరంలో నిర్మాణం పూర్తయిన భద్రాద్రి రామయ్య ఆలయం త్వరలోనే అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని అట్లాంటా నగరంలో ప్రతిష్ట కానుండడంతో ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేయాలని కోరుతూ యువశిల్పి బాల సుబ్రహ్మణ్యం ఆచారి మరియు అమెరికాఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల బృందం కేంద్ర మంత్రులను కోరారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి కూడా తీసుకుని వెళ్లాలని కోరుతూ వారు వినతి పత్రం సమర్పించారు. దుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రులు కూడా తప్పకుండా ఈ విషయాన్ని ప్రధానమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని... భద్రాద్రి రామయ్య విషయంలో కూడా తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేస్తామని శిల్పి దురుగడ్డ బాలసుబ్రమణ్యం ఆచారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమెరికా ఆలయ ట్రస్టు బోర్డు బృందం తదితరులు పాల్గొన్నారు.

## కోట్లాది ప్రజల ఆరాధ్య దైవం వంగవీటి మోహన్ రంగా: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం:** భౌతికంగా వంగవీటి మోహన్ రంగ లేకపోయినప్పటికీ ఆయన కోట్లాది ప్రజల ఆరాధ్య దైవంగా గుండెల్లో జీవించే ఉన్నారని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం పట్టణం గొల్లగూడెం సెంటర్, తణుకు రోడ్డులో వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత రంగా విగ్రహాలకు ఎమ్మెల్యే శ్రీనివాస్ టిడిపి నేత బాబ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం మార్చగల సామర్థ్యం ఉన్న ఏకైక నాయకుడు వంగవీటి మోహన్ రంగా కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పటికీ ఆయన మరణం ఆ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిందన్నారు. వంగవీటి మోహన్ రంగా వ్యక్తి కాదని, మహాశక్తి అని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గంలో పుట్టినప్పటికీ బడుగు, బలహీన వర్గాల తరఫున పోరాడిన నాయకుడు రంగా అన్నారు. ఆయన మృతి చెంది 38 ఏళ్ళు కావస్తున్నప్పటికీ ఆయన జయంతి, వర్ధంతులను జరుపుకోవడం, స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ఆయన మాదిరిగా ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. ఆయన బాటలో నడవాలని, మరిన్ని మంచి కార్యక్రమాలు భవిష్యత్తులో చేస్తామన్నారు. టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జీ మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలు అందరికీ తెలుసు అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగ అని కొనియాడారు. ఆయన తనయుడు రాధాకు మంచి పదవులు రావాలని ఆకాంక్షించారు. రంగాను జాతి గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్ రామశెట్టి సురేష్ గారి ఆధ్వర్యంలో అక్కడ పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో బిజెపి నాయకుడు ఈతకోట తాతాజీ, వర్తనపల్లి కాశి,ఏపురి సాయి,దాగరపు శ్రీను, సుబ్రహ్మణ్యం, దేవేంద్ర,ఉమ్మడి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

==========================

## శ్రీవారి ఆలయంలో జూలై 9న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 9న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. జూలై 16వ తేదీన ఆణివార ఆస్థానం సందర్భంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే తిరుమంజనం కార్యక్రమం సుమారు 5 గంటలపాటు కొనసాగనుంది. తిరుమంజనం కార్యక్రమం అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. తిరుమంజనం కారణంగా మంగళవారంనాడు నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొంటారు.

==========================

## హైదరాబాద్‌లో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో రాహుల్ వర్సెస్ మోదీ.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్?లో ఇవాళ ఇదే సీన్ కనిపించింది. కాంగ్రెస్, బీజేపీ యూత్ వింగ్‌లు చేపట్టిన పోటాపోటీ ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. హిందుత్వంపై రాహుల్ గాంధీ పార్లమెంట్ వేదికగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ యూవ మోర్చా ఆందోళనకు దిగింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి గాంధీభవన్ ముట్టడికి బయల్దేరిన బీజేవైఎం కార్యకర్తలను అక్కడే పోలీసులు అడ్డుకున్నారు. బీజేవైఎం కార్యకర్తలు బారికేడ్లు తోసుకుని ముందుకెళ్లడంతో ఇరువర్గాలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు లాక్కునేందుకు ప్రయత్నించినా.. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేవైఎం కార్యకర్తలు దహనం చేశారు. అటు, బీజేపీకి పోటీగా ఆందోళనకు దిగింది కాంగ్రెస్ పార్టీ.రాహుల్‌పై మోదీ వ్యాఖ్యలను నిరసిస్తూ.. బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయల్దేరారు యూత్ కాంగ్రెస్ నేతలు. దీంతో గాంధీభవన్ ఎదుట బారికేడ్లు పెట్టి.. వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, రెండు పార్టీల ఆఫీసుల దగ్గర తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రాహుల్ క్షమాపణ చెప్పాలంటూ బీజేవైఎం డిమాండ్ చేస్తుంటే.. మోదీ క్షమాపణ చెప్పాలంటూ యూత్ కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నారు. ఇరు వర్గాలను పోలీసులు అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో వాతావరణం సర్దుమణిగింది.

==========================

## చాకరాజు వేముల వైసీపీ పార్టీ ఎంపీటీసీ రాజీనామా

**దొర్నిపాడు:** దొర్నిపాడు మండలంలోని చాకరాజు వేముల గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ కట్టుబడి షాజహాన్ గురువారం తన రాజీనామాను ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు కు అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరు ఎలాంటి ప్రలోభాలు కానీ ఒత్తిడీలు కానీ చేయలేదన్నారు తన వ్యక్తిగత కారణాలవల్ల ఎంపీటీసీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు ఎంపిటిసి పదవికి మాత్రమే ఈరోజు రాజీనామా చేసిననే కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడ లేదన్నారు

# బ్రిటీషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి



విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై,భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ధి గాంచిన పోరాట యోధుడు సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశాడు. సీతారామరాజు జన్మదినం 1897 జూలై 4.. హేవళంబి నామ సంవత్సరం, ఆషాఢ మాసం, శుద్ధ పంచమి – 23 ఘడియల 30 విఘడియలు. (సాయంకాల 4 గంటలకు) మఖా నక్షత్రయుక్త వృశ్చిక లగ్నం. వారి స్వగ్రామం ఇప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలోని మోగల్లు ,అయినా విజయనగరం దగ్గరి పాండ్రంగిలో తాతగారైన (మాతామహుడు) మందలపాటి శ్రీరామరాజు ఇంట రాజు జన్మించాడు. అయితే పెరిగింది మాత్రం పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో. రామరాజు తండ్రి వెంకట రామరాజు, తల్లి సూర్యనారాయణమ్మ. 9వ తరగతి వరకు చదివిన అల్లూరి.. సంస్కృతం, జోతిష్యశాస్త్రం, జాతక శాస్త్రం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం పొందారు. 1917లో విశాఖపట్నం జిల్లా క్రిష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టారు. రాజు కుటుంబం 1918 వరకు తునిలోనే ఉంది. ఆ కాలంలోనే చుట్టుపక్కలగల కొండలు, అడవులలో తిరుగుతూ, గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవాడు. ధారకొండ, కృష్ణదేవీ పేట మొదలైన ప్రాంతాలు ఈ సమయంలో చూసాడు. వత్సవాయి నీలాద్రిరాజు వద్ద జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం, హఠయోగం, కవిత్వం నేర్చుకున్నాడు. సూరి అబ్బయ్యశాస్త్రి వద్ద సంస్కృతం, ఆయుర్వేదం నేర్చుకున్నాడు.మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పాడు.చిన్నప్పటినుండి సీతారామరాజులో దైవ భక్తి, నాయకత్వ లక్షణాలు, దాన గుణం అధికంగా ఉండేవి. నిత్యం దైవ పూజ చేసేవాడు. తుని సమీపంలో పెదతల్లి ఉన్న గోపాలపట్టణంలో సీతమ్మ కొండపై రామలింగేశ్వరాలయంలో కొంతకాలం తపస్సు చేశాడు. 1916 ఏప్రిల్ 26 న ఉత్తరభారతదేశ యాత్రకు బయలుదేరాడు. బెంగాలులో సురేంద్రనాథ బెనర్జీ వద్ద అతిథిగా కొన్నాళ్ళు ఉన్నాడు. తరువాత లక్నోలో జరిగిన కాంగ్రెసు మహాసభకు హాజరయ్యాడు. కాశీలో కొంతకాలం ఉండి సంస్కృతభాషను అధ్యయనం చేశాడు. ఈ యాత్రలో ఇంకా బరోడా, ఉజ్జయిని, అమృత్‌సర్, హరిద్వార్, బదరీనాథ్, బ్రహ్మకపాలం మొదలైన ప్రదేశాలు చూసాడు. బ్రహ్మకపాలంలో సన్యాసదీక్ష స్వీకరించి, యోగిగా తిరిగివచ్చాడు. ఈ యాత్రలో అనేక భాషలు, విద్యలు కూడా అభ్యసించాడు. గృహవైద్య గ్రంథము, అశ్వశాస్త్రము, గజశాస్త్రము, మంత్రపుష్పమాల, రసాయన ప్రక్రియలు వంటి విషయాల గ్రంథాలను స్వయంగా వ్రాసుకొని భద్రపరచుకొన్నాడు. అనేక యుద్ధవిద్యల్లోను, ఆయుర్వేద వైద్యవిద్యలోను ప్రావీణ్యుడవటంచేత త్వరలోనే రాజు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఆరాధ్యుడయ్యాడు. మన్యం ప్రజల కష్టాలను నివారించడానికి ప్రయత్నించేవాడు. ముహూర్తాలు పెట్టడం, రక్షరేకులు కట్టడం, మూలికా వైద్యం, చిట్కా వైద్యం, రామాయణ భారత భాగవత కథలు వినిపించడం చేసేవాడు. భక్తి చూపేవారు. 1918 ప్రాంతంలో కొంగసింగిలో ఒక మోదుగ చెట్టు క్రింద మండల దీక్ష నిర్వహించాడు. ఇతనికి అతీంద్రియ శక్తులున్నాయని ప్రజలు భావించేవారు.బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేసింది. ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారు. శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేవి. మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేది. పోడు వ్యవసాయం చేసుకుంటూ, అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకుని జీవించే వారిపై బ్రిటీషువారు ఘోరమైన దురాగతాలు చేసేవారు. రక్షిత అటవీప్రాంతం పేరుతో పోడు కొరకు చెట్లను కొట్టడాన్ని నిషేధించింది ప్రభుత్వం. గిరిజనులకు జీవనాధారం లేకుండా చేసింది. అటవీ ఉత్పత్తుల సేకరణలో కూడా అడ్డంకులు సృష్టించింది. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మైనాడు. చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు. గంటందొర, మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎండు పడాలు, సంకోజి ముక్కడు, వేగిరాజు సత్యనారాయణ రాజు (అగ్గిరాజు), గోకిరి ఎర్రేసు, బొంకుల మోదిగాడు వంటి సాహస వీరులు 150 మంది దాకా ఇతని అజమాయిషీలో తయారయ్యారట. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు దోపిడీకి నిశ్చయించుకొన్నారు. ఆగష్టు 22న మన్యం విప్లవం ఆరంభమైంది.చింతపల్లి, కృష్ణదేవు పేట, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం, తదితర పోలీస్ స్టేషన్ లను ముట్టడించి ఆయుధాలను తీసుకెళ్లారు. ప్రభుత్వం ప్రజలను పెడుతున్న కష్టాలను చూడలేని రాజు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు. 1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపంలో ఒక ఏటి వద్ద కూర్చొని, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును (ఒక చెట్టుకు కట్టివేసి) ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపాడు. తల్లికి కూడా రాజు మరణ వార్తను తెలియజేయలేదు. మే 8 న రాజు దేహాన్ని ఫొటో తీయించిన తరువాత దహనం చేసారు. అతని చితా భస్మాన్ని సమీపంలో ఉన్న వరాహ నదిలో కలిపారు. ఆ విధంగా కేవలం 27 ఏళ్ళ వయసులోనే అల్లూరి సీతారామరాజు అమరవీరుడయ్యాడు. రామరాజు చనిపోయే ముందు రూథర్ ఫర్డ్ తో సాగిన సంభాషణ ఆయన వ్యక్తిత్వానికి దర్పణం పడుతుంది... నీలాంటి వీరుడు మా దేశంలో పుట్టి ఉంటే అని రూథర్‌ఫర్డ్ అన్న సందర్భంలో...."రూథర్‌ఫర్డ్.. పొరపాటున కూడా అలా ఊహించవద్దు. ఇది నా మాతృభూమి. ఇక్కడి మట్టి పవిత్రం, నీరు పవిత్రం, గాలి పవిత్రం. నదులు, కొండలు సమస్తం పవిత్రం. ఈ జన్మకే కాదు.. వేయి జన్మలకైనా ఈ పుణ్యభూమిలోనే పుడతాను. నా ప్రజల సముచ్ఛరణకే పాటుపడతాను". స్వరాజ్యం ఒకరిస్తే పుచ్చుకునే బిచ్చం కాదు. పోరాడి గెలుచుకునే హక్కు. రక్తమాంసాలు దారబోసి రక్షించుకోవాల్సిన వరం. నేను కోరేది సంపన్నులు, మేధావులు అనుభవించే స్వరాజ్యం కాదు. అట్టడుగున ఉన్న మనిషి కూడా స్వేచ్ఛా వాయువులు పీల్చే స్వరాజ్యం. ఎక్కడ భయానికి చావులేదో, ఎక్కడ ప్రతి మనిషి తల ఎత్తుకొని తిరగగలడో, ఎక్కడ ఒకరి కష్టాన్ని మరొకరు కొళ్లగొట్టరో, ఏది ద్వేష అసూయలకు అతీతమైన సంఘమో అలాంటి సంఘాన్ని రామరాజ్యాన్ని నేను కోరుతున్నాను.నీ దుష్ట రాజ్యం నా జాతిని సర్వనాశనం చేసింది. ఆ కన్నీటి ప్రవాహాల్లో కరిగిన ఈ గుండె కరడుకట్టింది. మీ పాలనపై పగబట్టింది. రేగిన ఈ అగ్ని జ్వాల చల్లారదు. మీ అధికారం అంతమయ్యేంతవరకు, ఆఖరి తలప్రాణి ఈ గడ్డ వదలి పారిపోయేంత వరకు ఈ నిప్పుటేరులే, ఈ రక్త వర్షాలే, ఈ జీవన మరణ పోరాటమే.. ఒక్క సీతారామరాజు చనిపోతే లక్షలాది సీతారామరాజులు ఉద్భవిస్తారు. ఒక్కొక్కడు ఒక్కొక్క విప్లవ వీరుడై విజృంభించి బ్రిటిష్ సామ్రాజ్యపు పునాదులు పెళ్లగిస్తారు. సీతారామరాజు ఒక వ్యక్తి కాదు.. సమూహశక్తి, సంగ్రామ భేరి, స్వాతంత్ర్య నినాదం.

# ఆపత్కాలంలో ఆపద్ధర్మ ప్రధాని....

గుల్జారీలాల్ నందా పేరు ఈ తరం వారికి చాలా మంది తెలియక పోవచ్చు. అయన భారత దేశానికి రెండు సార్లు ఆపద్ధర్మ ప్రధాన మంత్రిగా భాధ్యతలను చేపట్టారు. పదవిలో ఉన్న ప్రధాని ఆకస్మికంగా మరణిస్తే, లోకసభ సభ్యులు మరో నేతను ఎన్నుకుని ఆ పదవిలో సదరు నేత చేరే వరకు తాత్కాలికంగా ప్రధాని పదవిని రాజ్యాంగం ప్రకారం నిర్వహించే పదాధికారిని ఆపద్ధర్మ ప్రధాన మంత్రి అంటారు. అలా నందా మొదటి సారి 1964 లో భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ మరణం తరువాత13 రోజులు (27 మే 1964 – 9 జూన్ 1964)బీ రెండవసారి 1966లో లాల్ బహదూర్ శాస్త్రి మరణం తరువాత (11 జనవరి 1966 – 24 జనవరి 1966) 13 రోజులు ఈ పదవిని చేపట్టారు. గుర్జారీలాల్ నందా (జూలై 4, 1898 – జనవరి 15, 1998) నిబద్ధత కలిగిన జాతీయ రాజకీయ నాయకుడు, ఆర్థికవేత్త. కార్మిక సమస్యలపై ప్రత్యేకంగా కృషిచేసిన వ్యక్తి. రెండు పర్యాయములు భారతదేశ తాత్కాలిక ప్రధాన మంత్రిగా నెల రోజుల లోపే పదవిలో ఉన్నారు. రెండు సందర్భాలలోనూ లోకసభలో మెజారిటీ సభ్యులు కలిగి ఉన్న భారత జాతీయ కాంగ్రెస్, లోకసభ నాయకుడిని అంటే ప్రధాన మంత్రిగా కొత్త నేత ఎన్నిన్నుకునే వరకు ఈ రెండు సందర్భాలలో దేశ మలి రాష్ట్రపతి సర్వేపెల్లి రాధా కృష్ణన్ చేత ప్రమాణ స్వీకారం చేయించ బడి, పరిపాలన బాధ్యతలు చేపట్టారు. 1997లో అతనికి భారత రత్న పురస్కారం స్వీకరించారు. గుల్జారీలాల్ నందా 1898 జూలై 4న బ్రిటిష్ ఇండియాలో అవిభాజ్య పంజాబ్ ప్రాంతములోని సియాల్‌కోట్ (ప్రస్తుతము పంజాబ్ (పాకిస్తాన్)లో ఉన్నది) పంజాబీ హిందూ కుటుంబంలో జన్మించారు. లాహోర్, అమృత్‌సర్, ఆగ్రా, అలహాబాద్ లలో విద్యాభ్యాసం చేసారు. ఆయన1920–1921 వరకు ఈయన అలహాబాద్ విశ్వవిద్యాలయములో కార్మిక సమస్యలపై పరిశోధన చేశారు. 1921 లో బొంబాయిలోని నేషనల్ కాలేజీలో ఆచార్య పదవిని పొందారు. అదే సంవత్సరము బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమములో పాల్గొన్నారు. 1922లో అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ కార్మిక సంఘము కార్యదర్శిగా చేరి 1946 వరకు అందులోనే కొనసాగారు. 1932లో సత్యాగ్రహము చేసి జైలు కెళ్లారు. మరలా 1942 నుండి 1944 వరకు జైలులో గడిపారు. రిజిస్టరు కాబడిన "అలహాబాదు విశ్వ విద్యాలయ పూర్వ విద్యార్థుల అసోసియేషన్" విడుదలచేసిన 42 సభ్యుల జాబితాలో "గర్వపడ వలసిన పూర్వ విద్యార్థి" గా గౌరవింప బడ్డారు. 1937లో బ్రిటిష్ ప్రభుత్వంలో బొంబాయి శాసనసభకు ఎన్నికైనారు. తరువాత 1937 నుండి 1939 వరకు బొంబాయి ప్రభుత్వంలో పార్లమెంటు సెక్రటరీ గా (కార్మిక, ఎక్సైజ్ శాఖలు) సేవలనందించారు. 1946 నుండి 1950 వరకు బొంబాయి ప్రభుత్వంలో కార్మిక మంత్రిగా ఉన్నప్పుడు అతను రాష్ట్ర శాసనసభలో కార్మిక వివాదాల బిల్లును ప్రవేశపెట్టడంలో విజయవంతంగా నాయకత్వం వహించారు. కస్తూర్బా మెమోరియల్ ట్రస్టు లో ఒక ట్రస్టీగా తన సేవలను అందించారు. హిందూస్థాన్ మజదూర్ సేవక్ సంఘ్ కు సెక్రటరీగా, బొంబాయి హౌసింగ్ బోర్డు కు చైర్మన్ గా పని చేశారు. జాతీయ ప్లానింగ్ కమిటీలో సభ్యుడుగా ఉన్నారు. "ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్" ను నిర్వహించడంలో ముఖ్యపాత్ర వహించి, తరువాత ఆ సంస్థకు అధ్యక్షునిగా భాధ్యతలు చేపట్టారు.1947లో నందా జెనీవా, స్విడ్జర్లాండ్ దేశాలలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సభలకు ప్రభుత్వ ప్రతినిధిగా హాజరయ్యారు. ఆ సమావేశంలో "ఫ్రీడం ఆఫ్ అసోసియేషన్ కమిటి"లో పనిచేస్తూ, స్వీడన్, ఫ్రాన్స్, స్విడ్జర్లాండ్, బెల్జియం, యు.కె దేశాలను సందర్శించి ఆ దేశాలలో గల కార్మికులు, వారి గృహ పరిస్థితులను అధ్యయనం చేసారు. మార్చి 1950లో భారత ప్లానింగ్ కమీషన్ లో వైస్ చైర్మన్ గా చేరారు. 1951 సెప్టెంబరులో అతను భారత ప్రభుత్వంలో ప్లానింగ్ మంత్రిగా నియమింప బడ్డారు. ఆయనకు వ్యవసాయం, విద్యుత్ శాఖలను కూడా అదనంగా కేటాయించారు. 1952 సార్వత్రిక ఎన్నికలలో బొంబాయి నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తిరిగి ప్లానింగ్, వ్యవసాయం, విద్యుత్ శాఖలకు మంత్రిగా



నియమితుడయ్యారు. 1955 లో సింగపూర్ లో జరిగిన ప్లాన్ కన్సల్టేటివ్ కమిటీకి భారతీయ ప్రతినిధులకు నాయకత్వం వహించారు. నందా 1957 ఎన్నికలలో లోక్‌సభకు ఎన్నిక అయి కార్మిక, ఉపాధి, ప్లానింగ్ శాఖలకు కేంద్రమంత్రిగా పనిచేసారు. 1959 లోజెనీవా జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశాలలో పాల్గొన్నారు. తరువాత ప్లానింగ్ కమీషన్ డిప్యూటీ చైర్మంగా భాధ్యతలు చేపట్టారు. 1959లో ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ, యుగోస్లేవియా, ఆస్ట్రియా దేశాలకు పర్యటించారు.నందా 1962 ఎన్నికలలో లోక్‌సభకు గుజరాత్ లోని శంబర్ కాంత నియోజకవర్గం నుండి తిరిగి ఎన్నికయ్యారు. సామ్యవాద నిర్మాణం కోసం కాంగ్రెస్ ఫోరం ప్రారంభించారు. 1962 – 1963 కాలంలో కార్మిక, ఉపాధి శాఖలకు కేంద్రమంత్రిగాను, 1963 – 1966 కాలంలో హోం మంత్రిగానూ పదవులను చేపట్టారు. 1967,1971 లోక్‌సభ ఎన్నికలలో హర్యానాలోని కైతల్ నియోజవ వర్గం నుండి ఎన్నికైనారు.

# తులసి ఆకులతో చేసిన టీ తాగితే సీజనల్ వ్యాధులు పరార్...!




ఉన్నంటుండి వర్షాలు దంచికొడుతున్నాయి. ఇన్నాళ్లు ఎండలకు ఉక్కిరిబిక్కిరి అయిన జనాలు కాస్త రిలాక్స్ అవుతున్నారు. కానీ సీజనల్ వ్యాధులకు గురించి భయపడిపోతున్నారు. కొందరైతే అప్పుడే పలు చిట్కాలు ఫాలో అయిపోతున్నారు. వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి తప్పించుకోవడానికి పలు రకాల ఫ్రూట్స్, ఆహార పదార్థాలను తినడం మానేశారు. అంతేకాకుండా ఆయుర్వేద చిట్కాలతో ఉపశమనం పొందాలని చూస్తున్నారు. అయితే భాతరదేశంలోని అందరి ఇళ్లలో ఉండే తులసి మొక్క సీజనల్ వ్యాధులకు తగ్గించడంతో పాటుగా పలు రకాల అనారోగ్య సమస్యలను కూడా తగ్గిస్తుందని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. ఈ ఆకులతో టీ కనుక పెట్టుకుని తాగితే రోగాలు పరార్ అవుతాయని అంటున్నారు. తులసి ఆకుల్లో ఉండే కాల్షియం, మినరల్స్, ఖనిజాలు, విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం, ప్రొటీన్, ఫైబర్ వంటివి ఉండి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా తులసి ఆకులతో చేసిన టీ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. వర్షంలో తడవటం వల్ల గొంతు నొప్పి దగ్గు, జలుబు వంటి సమస్యలు తీవ్రతరం అయి ఏ పని చేయకుండా చేస్తాయి. కాబట్టి తులసి ఆకులను నీటిలో వేసి మరిగించి వడకట్టిన నీటిని తాగితే మంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే తులసి ఆకులు ఉదయం నిద్రలేవగానే నమలకుండా మింగాలి ఇలా చేయడం వల్ల వైరల్ ఇన్ఫెక్షన్స్ రాకుండా ఉండే అవకాశం ఉంది. చాలామందికి వర్షాకాలం వచ్చిందంటే చాలు పలు రకాల అలర్జీలు రావడంతో నానా అవస్థలు పడుతుంటారు. అలాంటి వారు తులసి ఆకులతో చేసి టీని తాగితే ఇమ్యూనిటీ పెరిగి ఇన్ఫెక్షన్లను, అలర్జీలను తగ్గిస్తుంది. ఈ టీ తీసుకోవడం వల్ల అజీర్ణం, కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు వంటివి బాధపెడుతుంటాయి. దీంతో అతలాకుతలం అయితుంటారు. ఎలా తగ్గించుకోవాలనే ఆలోచనలతో వంటింట్లో దొరికే పదార్థాలను వాడుతుంటారు. కానీ తులసి టీ తీసుకుంటే ఈ సమస్యలు తగ్గుతాయి. అలాగే తులసిలో ఎక్స్‌పెక్టరెంట్, డికాంగెస్టెంట్ లక్షణాలు ఉండి సీజనల్ సమస్యలు దగ్గు, జలుబు, సైనస్, శ్వాసకోశ సమస్యలకు చెక్ పెడుతుంది. వర్షాకాలం తులసి ఆకులతో చేసిన టీ లేదా కషాయం, తులసి ఆకుల నీరు తాగితే హెల్తీ గా ఉండవచ్చు. అలాగే ఎలాంటి అనారోగ్య సమస్యలు కూడా దరి చేరకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు.

# ఎండు చేపల ఆరోగ్య ప్రయోజనాలు...!




సాధారణంగా చేపలు తినడం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. ఇందులో ఉన్న విటమిన్ ఎ వల్ల కళ్లకు చాలా మంచిది. అదే విధంగా తరచుగా చేపలు తినడం వల్ల ఆరోగ్యంతో పాటు మన శరీరానికి కావాల్సిన అన్ని రకాల పోషకాలు కూడా అందుతాయి. అయితే మార్కెట్లో మనకు పచ్చి చేపలు అలాగే ఎండు చేపలు ఇలా రెండు రకాల చేపలు లభిస్తూ ఉంటాయి. ఎక్కువ శాతం మంది పచ్చి చేపలు తెచ్చుకుని తింటూ ఉంటారు. కేవలం కొన్ని ప్రదేశాల్లో కొంతమంది మాత్రమే ఈ ఎండు చేపలతో కూరలు చేసుకుని తింటూ ఉంటారు. ఎండు చేపల పేరు వినగానే చాలామంది ముక్కు మూసుకుంటూ ఉంటారు. ఎందుకంటే వాటి నుంచి వచ్చే వాసన చాలా భయంకరంగా ఉంటుంది. అందుకే వాటిని తినడానికి కూడా చాలా మంది ఇష్టపడరు. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే ఎండు చేపలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఎండు చేపలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో దాని గురించి నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు మనం తెలుసుకుందాం..ఎండు చేపలలో పుష్కలంగా ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం, ఫాస్ఫరస్, సెలీనియం, నియాసిన్, విటమిన్ బి 12, సంతృప్త కొవ్వు ఆమ్లాలు, కేలరీలు, సోడియం ఉంటాయి. కాబట్టి వీటిని తినడం వల్ల ఎండు శరీరం పొడిబారడం తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు.అంతేకాదు రక్తపోటును, నరాల సమస్యలు నియంత్రించి.. కండరాల నిర్మాణానికి ఎండు చేపలు దోహదం చేస్తాయని అంటున్నారు నిపుణులు. అదేవిధంగా ఎండు చేపలలో ఉండే పొటాషియం నాడీ వ్యవస్థను, కండరాలను, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది అంటున్నారు నిపుణులు. వీటిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వు మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. మరి ముఖ్యంగా ఎండు చేపలు గర్భిణీ స్త్రీలకు ఎంతో మంచి చేస్తాయని అంటున్నారు నిపుణులు.ఎండు చేపలలో ఫాస్ఫరస్ పుష్కలంగా ఉండటం వల్ల శరీరంలో ఎముకలు పుష్టిగా ఉంటాయి. అంతే కాదు దంతాల నిర్మాణాన్ని నిర్వహించడానికి కూడా ఎండు చేపలు ఎంతగానో ఉపయోగపడతాయి.

# మ్యాంగోస్టిన్ ఫ్రూట్ ప్రయోజనాలు



మిగతా సీజన్లలో పోలిస్తే వర్షాకాలం వ్యాధులు మరింత పెరుగుతాయి. చల్లటి వాతావరణాన్ని శరీరం తట్టుకోకపోవడంతో.. అనేక రకాల సమస్యలు తలెత్తితూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. మరీ ముఖ్యంగా దోమల బెడద వల్ల వైరల్ ఫీవర్, ఫ్లూ, డెంగ్యూ, న్యుమోనియా, మలేరియా, వాంతులు, విరేచనాలు, కామెర్లు వంటి ప్రమాదకర సమస్యలు వస్తాయి. దీంతో చాలా మంది పలు ఇంట్లోంచి బయటకు రావడానికి కూడా భయపడిపోతుంటారు. ఒకవేళ వచ్చినా పలు రకాల చిట్కాలు పాటించి జబ్బుల నుంచి తమను తాము రక్షించుకుంటారు. అయితే వర్షాకాలం మ్యాంగోస్టిన్ పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్ సి ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచి జబ్బులు రాకుండా చేస్తుంది. మ్యాంగోస్టిన్ పండ్లు యాంటీఆక్సిడెంట్లు కలిగి ఉంటాయి కాబట్టి వీటిని తినడం వల్ల క్యాన్సర్ కణాలు ఉత్పత్తి కాకుండా అడ్డుకుంటాయి. అలాగే పలు రకాల అనారోగ్య సమస్యలను దరి చేరకుండా తరిమికొడతాయి. వర్షాకాలం జనాలను బాగా ఇబ్బంది పెట్టే జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధులను మ్యాంగోస్టిన్ అడ్డుకోవడంతో పాటు శరీరానికి మేలు కలిగిస్తాయి. పండ్లు బీపీని కంట్రోల్ చేయడంతో పాటుగా గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అలాగే ఇందులో ఫైబర్ ఉండి చెడు కొలెస్ట్రాల్‌ను కరిగించి బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. మ్యాంగోస్టిన్ పండ్లు ఆరోగ్యానికే కాకుండా చర్మ సౌందర్యాన్ని కూడా పెంచుతాయి.


# ఈ ఫుడ్స్ తింటే ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయంట



ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. కావున ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలాముఖ్యం.. శరీరంలోని కీలక అవయవాల్లో ఊపిరితిత్తులు ఒకటి..ఊపిరితిత్తులను జాగ్రత్తగా చూసుకోవడం చాలాముఖ్యం.. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రధాన ప్రమాద కారకాలలో జలుబు, న్యుమోనియా, క్షయ, ఆస్తమా, క్యాన్సర్, శ్వాసలోపం, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు మొదలైనవి ఉన్నాయి. మీకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నా.. అస్తమా లాంటివి ఉంటే.. మీ ఊపిరితిత్తులు బలహీనంగా ఉన్నట్లు లెక్క. వాయు కాలుష్యం స్థాయిలు పెరుగుతున్న కొద్దీ, ఊపిరితిత్తుల ఆరోగ్యం క్షీణిస్తూ ఉంటుంది. కాలుష్యం కూడా పెరుగుతోంది.. కావున ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.. అందులో ఆహారం ముఖ్యం పాత్ర పోషిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఊపిరితిత్తులను రక్షించే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకోండి. క్యాటెచిన్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న గ్రీన్ టీ రోజూ తాగితే ఊపిరితిత్తుల పనితీరు, ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఊపిరితిత్తుల పనితీరుకు తోడ్పడే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే బ్లూబెర్రీస్, క్రాన్ బెర్రీస్ వంటి బెర్రీలను తీసుకోవడం మంచిది. శరీర వాపును తగ్గించడానికి, ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరచడానికి సాల్మన్ ఫిష్, వాల్‌నట్‌లు వంటి ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారాలను తినాలి.ఇది కాకుండా పసుపు కూడా రెగ్యులర్ గా తీసుకోవాలి.. ఆహారంలో పసుపును తీసుకుంటే.. దాని ఇమ్యునోస్టిమ్యులెంట్, లక్షణాలు శ్వానకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కోసం బచ్చలికూర వంటి ఆకు కూరలను మీ ఆహారంలో పుష్కలంగా తినాలి..బ్రోకలీ, బ్రస్సెల్స్ మొలకలు వంటి కూరగాయలను మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలతో మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నారింజ, నిమ్మకాయలు వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని ప్రోత్సహిస్తుంది. యాపిల్స్ కూడా తినవచ్చు.. యాపిల్స్‌లో యాంటీఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్, బీటా కెరోటిన్, విటమిన్లు సి, ఇ పుష్కలంగా ఉన్నాయి.

# పొగ తాగడం వల్ల నోటి క్యాన్సర్ మాత్రమే కాదు..

## శరీరంలో ఈ భాగాలకు కూడా ముప్పు తప్పదు!



పొగాకు ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ధూమపానం ధమనులను బలహీనపరిచి, వాటి పనితీరును బలహీనపరుస్తుంది. ఇది కరోనరీ హార్ట్ డిసీజ్ కారణమై గుండెపోటుకు దారితీస్తుంది.గత కొన్నేళ్లుగా గుండెజబ్బుల సంఖ్య పెరగడం వెనుక ధూమపానం ప్రధాన కారణమని ఇప్పటికే అనేక అధ్యయనాలు వెల్లడించాయి. అయితే బీడీలు, సిగరెట్లే మాత్రమేకాదు.. గుట్కా తినడం, పొగాకు ఉత్పత్తులను తినడం వల్ల కూడా ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీంతోనోరు, ఊపిరితిత్తుల నుంచి మొదలుకొని శరీరంలోని వివిధ అవయవాలకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ధూమపానం, పొగాకు వినియోగం కేవలం నోటికి మాత్రమేకాకుండా శరీరంలోని వివిధ భాగాలలో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. ధూమపానం వల్ల ఊపిరితిత్తులు, కడుపు, మూత్రాశయం, మూత్రపిండాలు, క్లోమం, గర్భాశయ క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అధిక ధూమపానం కూడా మన మెదడులోని రక్తనాళాల లైనింగ్‌లో రక్తం గడ్డకట్టడానికి కారణమవుతుందట. ఫలితంగా ధూమపానానికి అలవాటు పడిన వారిలో కూడా అధిక రక్తపోటుతో పాటు అనేక ఇతర సమస్యలు తలెత్తుతున్నాయి. బలహీనమైన రక్త నాళాలు కరోనరీ హార్ట్ డిసీజ్, గుండెపోటు, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి ప్రమాదాన్ని పెంచుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధూమపానం లేదా గుట్కాకు అలవాటుపడిన వారు ఒక్క రోజులో మానేయ కూడదు. క్రమంగా ఈ అలవాటును వదిలించుకోవాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పొగ త్రాగాలని లేదా గుట్కా తినాలని అనిపించినప్పుడు దానిని విస్మరించడానికి.. మిమ్మల్ని మీరు ఏదో ఒక పనిలో బిజీగా ఉంచుకోనేలా చూసుకోవాలి. దీనితోపాటు నిపుణుల సిఫార్సుపై నికోటిన్ ఇన్హేలర్, చూయింగ్ గమ్ లాంటివి ఉపయోగించడం ద్వారా ధూమపానం అలవాటును మానేయవచ్చు. అయితే వాటిని ఉపయోగించే ముందు వైద్యులను సంప్రదించడం మర్చిపోకూడదు.

# మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నారా....!



ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటున్న సమస్యల్లో మలబద్ధకం సమస్య ఒకటి. చిన్న వారి నుంచి పెద్దవారి వరకు చాలా మంది ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అయితే శరీరానికి కావలసిన మోతాదులో ఫైబర్ ఫుడ్ తీసుకోకపోవడం వలన ఈ సమస్య అనేది వస్తుంది. అందువలన తప్పకుండా ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 గ్రాముల ఫైబర్ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీని వలన మలబద్ధకం సమస్య నుంచి ఈజీగా బయటపడవచ్చునంటన.కాగా, ఈ సమస్య నుంచి బయట పడటానికి ఈఫుడ్ తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కాగా, అది ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. మలబద్ధకం సమస్య నుంచి బయటపడటానికి రాజ్మా తీసుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే ఇందులో ఎక్కువ ఫైబర్ ఉంటుంది. అలాగే శరీరానికి కావాల్సిన మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం కూడా ఇందులో పుష్కలంగా ఉంటుంది. అందుకే మలబద్ధకం సమస్యతో బాధపడేవారికి ఇది బెస్ట్ ఫుడ్.ఆరోగ్యానికి మంచి చేసే ఆకుకూరల్లో పాల కూర కూడా ఒకటి. ఇందులో విటమిన్ ఏ, సీ, కేతో పాటు ఫైబర్ కూడా ఉంటుంది. బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్స్, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

# ఖాళీ కడుపుతో నాలుగు వేప ఆకులు తింటే చాలు..



వేపలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మానవ శరీరంలోని అనేక ఆరోగ్య సమస్యలకు వేప దివ్యౌషధం. వేప చర్మ వ్యాధులు, జుట్టు సమస్యలు, శరీరం అంతర్గత ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఖాళీ కడుపుతో నాలుగు వేప ఆకులు నమలడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. నేటి ఆధునిక జీవనశైలి కారణంగా భారతదేశంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ సమస్యకు చాలా మంది నిరంతరం మందులు వాడుతూ ఉంటారు. బ్లడ్ షుగర్ లెవెల్స్ ని కంట్రోల్ చేయడానికి వేప మంచి హోం రెమెడీ. ఉదయం పూట ఖాళీ కడుపుతో వేప ఆకులను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. రక్తాన్ని పూర్తిగా శుద్ధి చేసేంత ఔషధ గుణాలు వేపలో ఉన్నాయి. ఇది రక్తం నుండి విషాన్ని తొలగించడం ద్వారా రక్తాన్ని నిర్విషీకరణ చేస్తుంది. వేప చర్మానికే కాదు పేగుకు కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే ఔషధ గుణాలు ఎసిడిటీ నుంచి ఉపశమనం పొందేందుకు సహకరిస్తాయి. వేప ఆకులను నీటిలో వేసి మరిగించి ఉదయాన్నే పరగడుపున తాగితే ఎసిడిటీ, కడుపునొప్పి సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. వేప జీర్ణ ప్రక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది కడుపులో పుండు, మంట, గ్యాస్ మొదలైన సమస్యల నుండి ఉపశమనం పొందుతుంది. ఇది మలబద్ధకం సమస్య నుండి కూడా ఉపశమనం కలిగిస్తుంది. వేప ఆకుల్లో అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది మన శరీరం రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. అంతే కాదు జలుబు, దగ్గు మొదలైన వ్యాధులను నయం చేసేందుకు ఉపయోగిస్తారు.

# సిని శెట్టి అందాల విందు...




ఫెమినా మిస్ ఇండియా 2022 కిరీటాన్ని సొంతం చేసుకున్న కన్నడ ముద్దుగుమ్మ సిని శెట్టి. ముంబై లో సెటిల్ అయిన ఈ అమ్మడు బాలీవుడ్ లో అడుగు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేస్తున్న ఫోటోలు మరియు వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఎయిర్ టెల్ నెట్వర్క్ కి సంబంధించిన పలు కమర్షియల్ యాడ్స్ లో నటించిన సినీ శెట్టి ఈ మధ్య కాలంలో వరుసగా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ అలరిస్తుంది. తాజాగా మరోసారి సోషల్ మీడియాలో ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది బ్లాక్ కలర్ బ్లేజర్ , అదే కలర్ ప్యాంట్ ను ధరించింది. బ్లేజర్ బటన్స్ ఓపెన్ చేయడం తో చూపు తిప్పుకోనివ్వకుండా చేసిన ఈ అమ్మడు బ్రాలెస్ పోటోలు షేర్ చేసి సర్ప్రైజ్ చేసింది అంటూ నెటిజన్స్, మీడియా వర్గాల వారు కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయి అందాల ఆరబోత కంటిన్యూ చేస్తే కచ్చితంగా ముందు ముందు బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ లో కూడా బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# నైజాంలో సూర్య కంగువను విడుదల చేస్తుందెవరంటే..?

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి కంగువ. శివ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో సూర్య 42 ప్రాజెక్ట్గా తెరకెక్కుతోంది. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన కంగువ గ్లింప్స్ వీడియో, పోస్టర్లు సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. కంగువ అక్టోబర్ 10న భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ షేర్ చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో పాపులర్ టాలీవుడ్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేస్తోంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ స్పెషల్ వీడియోను షేర్ చేశారు. కంగువ పంపిణీ హక్కులను మైత్రీ మూవీ మేకర్స్ భారీ మొత్తానికి దక్కించుకున్నట్టు సమాచారం. ఇప్పటికే లాంఛ్ చేసిన కంగువ టీజర్ గూస్ బంప్స్ తెప్పించే యాక్షన్ సన్నివేశాలతో సాగుతూ నెట్టింట క్యూరియాసిటీ పెంచుతోంది.

ఈ మూవీలో బాబీ డియోల్ ఉధిరన్ పాత్రలో నటిస్తున్నాడు. కంగువ పోస్టర్లో సూర్య ఓ వైపు వారియర్గా కత్తి పట్టుకుని.. మరోవైపు స్టైలిష్ లుక్లో మ్యాజిక్ చేస్తున్నాడు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్లో నటిస్తోంది. స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న కంగువ 10 భాషల్లో విడుదల కానుంది. 3డీ ఫార్మాట్లో కూడా సందడి చేయనుంది కంగువ. ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.




# ప్రభాస్ కల్కి 2898 ఏడీలో స్పెషల్ అట్రాక్షన్గా విజయ్ దేవరకొండ.. అర్జున లుక్ వైరల్




గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంపౌండ్ నుంచి వచ్చిన ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ. నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్ జోనర్లో తెరకెక్కగా.. ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో థియేటర్లలో గ్రాండ్గా విడుదలైంది. కాగా ఈ చిత్రంలో స్టార్ సెలబ్రిటీలు సర్ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి మూవీ లవర్స్ను ఖుషీ చేస్తున్నారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తమ అభిమాన యాక్టర్లు సిల్వర్ స్క్రీన్పై కనిపించగానే థియేటర్లలో ఈలలు, కేకలతో దద్దరిల్లిపోతున్నాయి. కల్కిలో సందడి చేసిన స్టార్ హీరోల్లో ఒకడు విజయ్ దేవరకొండ. సినిమా విడుదలయ్యే వరకు విజయ్ దేవరకొండ ఎంట్రీకి సంబంధించి సస్పెన్స్ మెయింటైన్ చేశాడు నాగ్ అశ్విన్. ఇందులో అర్జునుడుగా పవర్ ఫుల్ రోల్లో కనిపించాడు రౌడీ బాయ్. అర్జునుడి గెటప్లో రథంపై నిలబడి విజయ్ దేవరకొండ చెప్పే డైలాగ్స్ అందరినీ ఇంప్రెస్ చేస్తున్నాయి. తాజాగా మేకర్స్ అర్జున లుక్ను అందరితో పంచుకున్నారు. విజయ్ దేవరకొండ రాజసం ఉట్టిపడే లుక్లో ఠీవిగా నిలబడి విల్లు ఎక్కుపెట్టిన పోస్టర్ నెట్టింటిని షేక్ చేస్తోంది. కల్కి 2898 ఏడీ విడుదలైన అన్ని కేంద్రాల్లో తొలి రోజు నుంచి పాజిటివ్ టాక్తో స్క్రీనింగ్ అవుతోంది. ఈ మూవీ ఫస్ట్ వీక్లోనే రూ.700 కోట్ల క్లబ్లోకి ఎంట్రీ ఇచ్చి టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగా నిలుస్తోంది. 2024లో హిందీలో భారీ హిట్గా నిలిచి.. అరుదైన రికార్డును సొంతం చేసుకునే దిశగా ముందుకెళ్తోంది. వైజయంతీ మూవీస్ అత్యంత భారీ బడ్జెట్తో తెరకెక్కించిన ఈ చిత్రంలో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషించారు. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర కీలక పాత్రల్లో నటించగా.. బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ విలన్గా నటించాడు.

# కమల్హాసన్ ఇండియన్ 2 తెలుగు ప్రమోషనల్ ఈవెంట్ డేట్ ఫైనల్...!




కోలీవుడ్, టాలీవుడ్తోపాటు గ్లోబల్ మూవీ లవర్స్ ఎక్జయిటింగ్గా ఎదురుచూస్తున్న మోస్ట్ అవెయిటెడ్ సినిమా ఇండియన్ 2. శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. కమల్హాసన్ టైటిల్ రోల్లో నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్కు మంచి స్పందన వస్తోంది. కాగా ఇటీవలే చెన్నైలో ప్రమోషనల్ ఈవెంట్ నిర్వహించారు మేకర్స్. తాజాగా తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్కు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది.

మేకర్స్ ఇండియన్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ను హైదరాబాద్లో గ్రాండ్గా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారట. తాజా టాక్ ప్రకారం జులై 7న ఈవెంట్ నిర్వహించనుండగా.. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే రాబోతుందని తెలుస్తోంది. ఇదే నిజమైతే తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్కు ముఖ్యఅతిథులుగా ఎవరెవరొస్తారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. మేకర్స్ రీసెంట్గా రిలీజ్ చేసిన క్యాలెండర్ సాంగ్లో 2017 మిస్ యూనివర్స్ డెమి లెంగ్త్ లె టెబో అందాలు ఆరబోస్తూ హాట్ టాపిక్గా నిలుస్తోంది. ఇండియన్ 2 నుంచి మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన గ్లింప్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది.

# పన్ను చెల్లింపుదారులకు గుడ్ న్యూస్......




కేంద్ర బడ్జెట్ సమయం ఆసన్నమైంది. ఈ నెలలోనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ యూనియన్ బడ్జెట్-2024ను ప్రవేశపెట్టనున్నారు. కేంద్రంలో మూడో సారి బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో అన్ని వర్గాల వారు బడ్జెట్ లో భారీ అంచనాలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు. అయితే కొన్ని ఆర్థిక సంస్థల నివేదికల ప్రకారం కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని పెంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రధాన మంత్రి కార్యాలయంలో సంప్రదింపులు, అంతర్గత మదింపులను అనుసరించి.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన మొదటి బడ్జెట్‌లో ఈ నిర్ణయం ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టాండర్డ్ డిడక్షన్ అంటే ఏమిటి? అది ఇప్పటి వరకూ ఎంత ఉంది? ఇప్పుడు ఎంత ఉండే అవకాశం ఉంది? తెలుసుకుందాం రండి.. స్టాండర్డ్ డిడక్షన్ అనేది పన్ను చెల్లింపుదారులు తమ పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం నుంచి రసీదులు లేదా ఖర్చు రుజువుల అవసరం లేకుండా తీసివేయగల స్థిర మొత్తం. ఇది పన్ను విధించదగిన ఆదాయాన్ని తగ్గిస్తుంది. తద్వారా మొత్తం పన్ను భారాన్ని తగ్గిస్తుంది. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త పన్ను విధానంలో జీతం పొందే వ్యక్తులు, పెన్షనర్‌లకు రూ. 50,000 స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రతిపాదించారు. పన్ను చెల్లింపుదారులు దీనిని నిలిపివేయాలని ఎంచుకుంటే తప్ప.. ఈ మినహాయింపు డిఫాల్ట్‌గా అందరికీ వర్తిస్తుంది. అదనంగా, సెక్షన్ 87ఏ కింద పన్ను మినహాయింపుకు అర్హత ఉన్న ఆదాయ పరిమితి రూ. 7 లక్షలకు పెంచారు. కొత్త పన్ను విధానంలో పన్ను గణనలను సులభతరం చేస్తూ అత్యధిక సర్‌ఛార్జ్‌ను కూడా తొలగించింది. అయితే, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఈ పరిమితి సరిపోదని నిపుణులు చెబుతున్నారు.

## కాలర్ ఐడీ విషయంలో ట్రాయ్ కీలక నిర్ణయం...




ఇటీవల కాలంలో ఫోన్ల వాడకం బాగా పెరిగింది. ప్రతి ఇంట్లో రెండు నుంచి మూడు ఫోన్లు ఉంటున్నాయంటే వాటి వాడకం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే మంచి ఉన్న చోటే చెడు ఉన్న చందాన ఈ ఫోన్లు వాడి మోసం చేసే వారి సంఖ్య కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో మనకు ఫోన్ ఎవరు చేశారనే విషయం తెలుసుకునేలా స్మార్ట్ ఫోన్లకు ఉపయోగపడేలా ట్రూ కాలర్ యాప్ ఇటీవల కాలంలో అత్యంత ప్రజాదరణ పొందింది. అయితే మనకు ఫోన్ ఎవరు చేశారో? తెలుసుకోవడానికి ట్రూ కాలర్ యాప్ ఉపయోగపడినా మన ఫోన్ భద్రత విషయంలో థర్డ్ పార్టీ యాప్ అయిన ట్రూ కాలర్‌ను విశ్వసించలేము. ఈ నేపథ్యంలో భారతదేశంలో మొబైల్ వినియోగదారులకు మెరుగైన భద్రతను అందించేందుకు ట్రాయ్ కీలక చర్యలను తీసుకుంది. టెలికాం ఆపరేటర్లు ముంబై, హర్యానాలో కాల్ ఐడి ప్రజెంటేషన్‌కు సంబంధించిన పరిమిత ట్రయల్స్ నిర్వహించారు. ఈ చర్యలు విజయవంతం కావడంతో కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ సదుపాయాన్ని రానున్న నెలల్లో త్వరలో దేశవ్యాప్తంగా టెలికాం ఆపరేటర్లు అమలు చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాయ్ కీలక చర్యల గురించి వివరాలను తెలుసుకుందాం. కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ సదుపాయం సిమ్ కార్డ్ కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు కేవైసీ ఫారమ్‌లో నింపిన సమాచారం ఆధారంగా కాలర్ పేరు ప్రదర్శితమవుతుంది. దేశంలో నకిలీ, స్పామ్ కాల్‌లను అరికట్టడానికి టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా, టెలికాం శాఖ ఈ చర్యలు తీసుకుంది. సీఎన్‌ఏపీ సర్వీస్ ట్రూ కాలర్‌లానే ఉంటుంది. ఈ ఫీచర్ పని, సాధ్యాసాధ్యాలను అర్థం చేసుకోవడానికి టెలికాం కంపెనీలు మొదట ముంబై మరియు హర్యానాలోని పరిమిత నగరాల్లో దీనిని పరీక్షించినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. పరీక్ష ఫలితాలు టెలికమ్యూనికేషన్స్ శాఖ అందుకుంది. ఈ నేపథ్యంలో సాధ్యాసాధ్యాల పరిశీలన తర్వాత ప్రతిపాదిత సేవ గురించి ఆచరణాత్మక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే సీఎన్‌ఏపీ సర్వీస్‌ను ప్రారంభించడానికి టెలికాం ఆపరేటర్లకు జూలై 15 వరకు గడువు ఇచ్చారని, ఈ లోపే ఈ తాజా అప్‌డేట్ యూజర్లకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఫెనోమ్ చేతికి టైడీ రెండేళ్లలో ఉద్యోగుల రెట్టింపు




మానవ వనరుల సాంకేతిక స్టార్టప్ టైడీని కొనుగోలు చేసినట్లు హెచ్‌ఆర్ టెక్ సంస్థ ఫెనోమ్ ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫెనోమ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఇంజనీరింగ్) శివానంద్ అకెల్ల మాట్లాడుతూ.. ఇది తమ ఇంటెలిజెంట్ టాలెంట్ ఎక్స్‌పీరియన్స్ ప్లాట్‌ఫామ్ పోర్ట్ ఫోలియోకు అదనపు జోడింపు అని పేర్కొన్నారు.

ప్రస్తుతం భారత్‌లోని విశాఖలో ఒక్కటి, హైదరాబాద్‌లో రెండు సెంటర్లలో 950 పైగా ఉద్యోగులు ఉన్నారన్నారు. వచ్చే రెండేళ్లలో కొత్తగా 1000 మందిని తీసుకోనున్నామని చెప్పారు. అదే విధంగా హైదరాబాద్ సెంటర్‌ను విస్తరించే యోచనలో ఉన్నామని తెలిపారు. హెచ్‌ఆర్ ప్రాక్టీషనర్స్‌కు సమర్థవంతమైన అనుభవాలను అందించనున్నామన్నారు. ఆన్‌బోర్డింగ్ అనేది టాలెంట్ జర్నీలో కీలకమైన సందర్భమన్నారు. ఇక్కడ అభ్యర్థులు ఉద్యోగులుగా మారుతారన్నారు. ప్రతిభ గల సంస్థలు వారిని విజయం సాధించేందుకు నియమించుకోవచ్చన్నారు. తాజా ఒప్పందంతో టైడీ సహ వ్యవస్థాపకులు కిరణ్ మీనన్, నిఖిల్ గుర్జెర్, గౌరవ్ మాథురేతో సహా వారి బందం ఫెనోమ్‌కి మారుతుందన్నారు.

## పాలసీదారులకు ఎల్ఐసీ హెచ్చరిక




భారతదేశంలో నమ్మకమైన బీమా సంస్థల్లో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ముందువరుసలో ఉంటుంది. చాలా ఏళ్లుగా ఎల్ఐసీ భారతీయుల నమ్మకాన్ని గెలుచుకుంది. ఎల్ఐసీ పాలసీ ఉంటే జీవితానికి ఆర్థిక భద్రత ఉన్నట్లేనని సాధారణ ప్రజలు అనుకుంటూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఈ నమ్మకాన్ని ఒమ్ము చేసేలా ఇటీవల కొన్ని నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. కొన్ని వ్యాపారాలు ఎల్ఐసీకి సరెండర్ చేయడానికి బదులుగా ప్రస్తుత ఎల్ఐసీ పాలసీదారుల నుంచి పాలసీలను కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నాయని వార్తలకు ప్రతిస్పందనగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) తన వైఖరిని స్పష్టం చేసింది . జీవిత బీమా బెహెమోత్ పాలసీదారులందరూ తమ కుటుంబ రిస్క్ కవరేజీని, ఆర్థిక స్థిరత్వాన్ని రాజీ పడేటటువంటి వారి పాలసీ గురించి ఏవైనా నిర్ణయాలు తీసుకునే ముందు చాలా జాగ్రత్త వహించాలని కోరింది. ఈ నేపథ్యంలో తాజా హెచ్చరికను ఎక్స్‌లో షేర్ చేసింది. ఎల్ఐసీ హెచ్చరికల గురించి వివరాలను తెలుసుకుందాం. పాలసీదారులందరి ప్రయోజనాల దృష్ట్యా ఎల్ఐసీ ఇటీవల విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఎల్ఐసీ ఎలాంటి సంస్థతో లేదా ఆయా సంస్థలు అందించే ఉత్పత్తులు మరియు/లేదా సేవలతో, ఏవైనా ప్రకటనలతో అనుబంధించలేదని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఎల్ఐసీ మాజీ ఉద్యోగులు/ సిబ్బంది అలాంటి వ్యక్తులకు లేదా సంస్థలకు దూరంగా ఉండాలని కోరింది.

## రికార్డు గరిష్టానికి నిఫ్టీ




**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ సూచీల్లోని సానుకూల పవనాలు మన మార్కెట్లకు దన్నుగా నిలుస్తున్నాయి. ఆరంభ ట్రేడింగ్‌లోనే రెండు ప్రధాన సూచీలు రికార్డు గరిష్ఠాలను తాకాయి. 79,787 దగ్గర సెన్సెక్స్, 24,209 వద్ద నిఫ్టీ ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. అనంతరం కొనుగోళ్ల అండతో తొలిసారి 80,000 కీలక మైలురాయిని తాకిన సెన్సెక్స్ 80,074 వద్ద సరికొత్త రికార్డును నెలకొల్పింది. నిఫ్టీ 24,296 దగ్గర తాజా జీవనకాల గరిష్ఠాన్ని నమోదుచేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 83.53 వద్ద ప్రారంభమైంది. ఉదయం 9:54 గంటల సమయంలో సెన్సెక్స్ 592 పాయింట్ల లాభంతో 80,033, నిఫ్టీ 175 పాయింట్లు ఎగబాకి 24,299 దగ్గర కొనసాగుతున్నాయి. సెన్సెక్స్-30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, నెస్లే ఇండియా, ఎం అండ్ ఎం, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. టీసీఎస్, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్, రిలయన్స్, టైటన్, మారుతీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్లు లాభాలతో ముగిశాయి. నేడు ఆసియా సూచీలూ సానుకూలంగా ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 86.72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు మంగళవారం నికరంగా రూ. 2,000 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు రూ. 648 కోట్ల వాటాలను కొనుగోలు చేశారు.

## హీరో బైక్, స్కూటర్ ప్రియులకు షాక్......



ఇటీవల కాలంలో భారతదేశంలో బైక్స్ స్కూటర్స్ కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. తగ్గుతున్న ప్రజా రవాణ నేపథ్యంలో ప్రతి ఇంట్లో రెండు నుంచి మూడు బైక్స్ లేదా స్కూటర్లు ఉంటున్నాయంటే వీటి వినియోగం ఎలా ఉందో? మనం అర్థం చేసుకోవచ్చు. భారతదేశంలో ఏళ్లుగా హీరో-హోండా బైక్స్ ఆటోమొబైల్ రంగాన్ని శాసించాయి. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా హీరో, హోండా కంపెనీలు రెండు వేరుపడి రెండు వేరువేరు కంపెనీలుగా మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా కొన్ని మోడల్స్ ధరలు పెంచుతున్నట్లు హీరో మోటో కార్ప్ కంపెనీ ప్రకటించింది. ఎంపిక చేసిన మోడళ్ల ఎక్స్-షోరూమ్ ధరలపై కంపెనీ ధరల పెంపును ప్రకటించింది. ఇది జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో హీరో బైక్స్, స్కూటర్ల ధరల పెంపు గురించి వివరాలను తెలుసుకుందాం. హీరో మోటో కార్ప్ కంపెనీ ప్రకారం ధరల సవరణ రూ. 1,500 వరకు ఉంటుంది. అయితే ఈ పెంపు మోడల్, మార్కెట్‌ను బట్టి మారుతూ ఉంటుంది. హీరో మోటోకార్ప్, స్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్టింగ్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో అధిక ఇన్‌పుట్ ఖర్చుల ప్రభావాన్ని పాక్షికంగా ఆఫ్‌సెట్ చేయడానికి సర్దుబాటు అవసరమని పేర్కొంది. అందుకు అనుగుణంగా ఈ ధరల పెంపును ప్రకటించారు.

## లోపాలను ఎత్తి చూపిస్తే బెదిరింపులు....!



అదానీ గ్రూప్ సంస్థలపై చేసిన ఆరోపణలకు గాను అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్‌కు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై హిండెన్‌బర్గ్ తీవ్రంగా స్పందించింది. భారతీయ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ సెబీ నోటీసులు జారీ చేసిందని హిండెన్‌బర్గ్ పేర్కొంది. భారత్‌లోని అత్యంత శక్తివంతమైన వ్యక్తులు చేసిన అవినీతి, మోసాలను బహిర్గతం చేయడానికి ప్రయత్నిస్తే తమను సెబీ బయపెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించింది. తమకు ఉద్దేశపూర్వకంగానే నోటీసులు జారీ చేసిందని ఆరోపించింది. అవినీతి అక్రమాలను బయటపెట్టిన ఒకటిన్నర సంవత్సరం తర్వాత కూడా ఈ కేసులో వాస్తవాలను గుర్తించడంలో సెబీ విఫలమైందని హిండెన్‌బర్గ్ విమర్శించింది. తాము వివిధ సంస్థలతో కలిసి అదానీ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకున్నామని వస్తున్న ఆరోపణల్లోనూ వాస్తవం లేదని తెలిపింది. భారత్‌లోని శక్తిమంతమైన వ్యాపారవేత్తల లోపాలను ఎత్తిచూపితే ఇలా నోటీసులు పంపడం సరికాదని హిండెన్‌బర్గ్ పేర్కొంది. అదానీ గ్రూప్ అవకతవకలను బయటపెట్టిన సమయంలోనే తాము ఆయా కంపెనీల స్టాక్స్‌పై షార్ట్ చేసినట్లు స్పష్టంగా వెల్లడించామని పేర్కొంది.

# దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడిచినా, తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులుబాసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహం రాష్ట్ర రాజధానిలో లేకపోవడం బాధాకరమని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని ఆయన ప్రకటించారు. గురువారం రవీంద్ర భారతిలో జరిగిన దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకల్లో మంత్రి పాల్గొని ఆ మహానుభావుడికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యమాలను, ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆనాటి దొడ్డి కొమురయ్య పోరాటమే స్ఫూర్తిగా, ఇంధనంగా పనిచేసిందని మంత్రి అన్నారు. నిజాం నిరంకుశత్వానికి, దేశ్ ముఖ్ ల వెట్టికి, ఆగడాలకు వ్యతిరేఖంగా పోరాడి వీరమరణం పొందిన వీరుడు దొడ్డి కొమురయ్య అని ఆయన కీర్తించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాటం అసామాన్యమైందని ఆయన గుర్తు చేశారు. ఆనాడు దేశమంతా స్వాతంత్ర్య సంబరాల్లో మునిగిపోతే, మన ప్రాంతం నిజాం పాలనలో మగ్గిపోవడం ఇష్టం లేక వీరోచిత పోరాటం చేసిన ఉద్యమ నాయకుడు దొడ్డి కొమురయ్య అని ఆయన అన్నారు. తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు దొడ్డి కొమురయ్య కీర్తి సజీవంగా ఉంటుందని ఆయన అన్నారు. ఆంధ్ర మహా సభ సందేశంతో యువకులంతా ఒక్కటై ఉద్యమిస్తుంటే నిజాం సేనలు తట్టుకోలేక ఉద్యమకారులపై కాల్పులు జరపడంతో దొడ్డి కొమురయ్య చనిపోయాడని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంఎల్‌సి యెగ్గే మల్లేషం, బిసి కమీషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, కమీషనర్ బాలమాయాదేవి, చంద్రశేఖర్, అలోక్ కుమార్, మల్లయ్యభట్టుతో పాటు వివిధ బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తరాఖండ్‌లో వర్షబీభత్సం..

# 100 రహదారులు మూసివేత



డెహ్రాడూన్: దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్‌ను వర్షాలు ముంచెత్తుతున్నాయి. ప్రధాన నదులన్నీ ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. చంపావత్, అల్మోరా, పిథోర్‌గఢ్, ఉదమ్‌సింగ్ నగర్‌తోపాటు కుమాన్ తదితర ప్రాంతాల్లో మరో వారం రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని ఉత్తరాఖండ్ వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. డెహ్రాడూన్, తేహ్రి, హరిద్వార్ తదితర నదీ పరివాహక ప్రాంతాల్లో ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో గంగా, అలకనంద, భాగీరథీ, శారద, మందాకిని, కోసి నదుల్లో నీరు భారీగా ప్రవహిస్తోంది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నదులను ఆనుకొని ఉన్న దాదాపు 100 రహదారులను అధికారులు మూసివేశారు.

**నీట మునిగిన శివుడి విగ్రహం**

గత 24 గంటల్లో అల్మోరా లోని చౌకుతియా ప్రాంతంలో 72.5 మిమీ వర్షపాతం నమోదైంది. లోహఘట్ లో 59.మిమీ, చంపావత్‌లో 45 మిమీ, కాశీపుర్‌లో 42 మిమీ, హల్ద్వానీలో 31 మిమీ వర్షపాతం నమోదైంది. అలకనంద నది ఉప్పొంగడంతో రుద్రప్రయాగ్ వద్ద నది ఒడ్డున ఏర్పాటు చేసిన 10 అడుగుల శివుడి విగ్రహం నీట మునిగింది. ఈ నేపథ్యంలో అక్కడి వాతావరణ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నైనితాల్, పౌడీ జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ఎలాంటి విపత్తు తలెత్తినా, ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను జిల్లా మెజిస్ట్రేట్స్ ఆదేశించారు. గంగా, సరయూ నదులు ప్రమాదకర స్థాయికి కొంచెం దిగువన ప్రవహిస్తుండగా, అలకనంద, మందాకిని , భాగీరథి నదులు ఇప్పటికే ఆ స్థాయిని దాటేశాయి. మరోవైపు గోమతి, కాళీ, గౌరీ,శారద నదుల ప్రవాహం కూడా భారీగా పెరుగుతోంది. పలుచోట్ల కొండ చరియలు విరిగిపడడంతో బద్రీనాథ్, యమునోత్రి, ధర్చులా , తవాఘాట్ జాతీయ రహదారుల పైనా రాకపోకలు నిలిచి పోయాయి.

# వాయు కాలుష్యంతో భారత్‌లో ఏటా 33 వేల మరణాలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ప్రతీ సంవత్సరం 11.5 శాతం మరణాలు (దాదాపు 12,000 మంది) వాయు కాలుష్యం కారణంగా సంభవించి ఉండొచ్చని ప్రముఖ వైద్య పరిశోధన మాసపత్రిక లాన్సెట్‌లో ప్రచురితమైన ఓ నివేదిక అంచనా వేసింది. కాలుష్యం కారణంగా దేశంలో అత్యధిక మరణాలు సంభవిస్తుందీ ఈ మహా నగరంలోనేనని తెలిపింది. భారత్ లోని మొత్తం పది నగరాలు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, పుణె, సిమ్లా, వారణాసిలో అధ్యయనం చేశారు. ఏటా ఈ నగరాల్లో దాదాపు 33 వేల మరణాలు వాయుకాలుష్యం కారణంగా సంభవించి ఉండొచ్చని నివేదిక తెలిపింది. సిమ్లాలో అత్యల్పంగా 59 మంది మరణించారు. అక్కడ సంభవిస్తున్న మరణాల్లో ఇది 3.7 శాతానికి సమానం. మొత్తం పది నగరాల్లో నమోదైన మరణాల్లో 7.2 శాతం కాలుష్యం వల్లేనని కుండబద్దలు కొట్టింది. భారత్ సహా విదేశీ పరిశోధకులు కలిసి ఈ అధ్యయనం చేశారు. పది నగరాల్లో పీఎం 2.5 కాలుష్య రేణువుల స్థాయి ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రామాణిక పరిమితులను మించాయని వెల్లడించింది. సంవత్సరంలో 99.8 శాతం రోజులు ఇదే పరిస్థితి ఉంటోందని తెలిపింది. 2008 నుంచి 2019 మధ్య పది నగరాల్లోని సివిల్ రిజిస్ట్రీల నుంచి మరణాల సమాచారాన్ని సేకరించారు. నగరాన్ని బట్టి మూడు నుంచి ఏడేళ్ల డేటా మాత్రమే వారికి లభించింది. మొత్తం 36 లక్షల మరణాలను అధ్యయనం చేశారు. మెషీన్ లెర్నింగ్ సాంకేతికతతో రూపొందించిన అత్యాధునిక పద్ధతుల ద్వారా పీఎం 2.5 రేణువుల స్థాయిలను అంచనా వేశారు. పీఎం 2.5 స్థాయిలు ప్రతీ క్యూబిక్ మీటరుకు 10 మైక్రోగ్రాములు పెరిగిన కొద్దీ మరణాలు 1.42 శాతం అధికమైనట్లు అధ్యయనం గుర్తించింది. పది నగరాల డేటాను కలిపినప్పుడు ఈ పరిస్థితి ఉందని తెలిపింది. విడివిడిగా గమనిస్తే నగరాల మధ్య వ్యత్యాసం భారీ గానే ఉందని పేర్కొంది. ఢిల్లీలో మరణాల సంఖ్య 0.31 శాతం పెరిగితే, బెంగళూరులో అది 3.06 శాతం పెరిగినట్లు వెల్లడించింది. సిఎం 2.5 స్థాయిలు పెరిగినప్పుడు కాలుష్యం అధికంగా ఉన్న నగరాలతో పోలిస్తే తక్కువ ఉన్న వాటిల్లోనే మరణాలు అధికమవుతున్నట్లు గుర్తించామని అధ్యయనం నిర్వహించిన పరిశోధకుల్లో ఒకరైన సెంటర్ ఫర్‌క్రానిక్ డిసీజ్ కంట్రోల్‌కు చెందిన సిద్ధార్థ్ మండల్ వెల్లడించారు. ఇలా వివిధ నగరాల్లో స్వల్పకాలంలో కాలుష్య ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడం భారత్‌లో ఇదే తొలిసారి అని మరో పరిశోధకుడు భార్గవ్ కృష్ణ తెలిపారు.



# అల్జీమర్స్‌కు జాగ్రత్తగా ఉండండి ఇలా - డాక్టర్ లిల్లీ మేరి

**సిద్దిపేట:** అల్జీమర్స్ కు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి సూచించారు.మాజీ కేంద్రమంత్రి జార్జ్ ఫెర్నాండేజ్, మాజీ ఐఏఎస్ అధికారి చాలా కాలం పాటు ప్రజలకు సేవలు అందించిన జన్నత్ హుస్సేన్ లాంటివారు అల్జీమర్స్ తో బాధపడ్డారు. ఇటీవల కాలంలో ఇలా అల్జీమర్స్ భారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. మనిషి జ్ఞాపకాలను మాయం చేసి, మెదడు పనితీరును దారుణంగా దెబ్బతీసే వ్యాధి ఇది. ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న అధ్యయనాల ప్రకారం ఒక శాతం కేసులో మాత్రమే అల్జీమర్స్ జన్యుపరంగా సంక్రమిస్తుంది. మిగిలిన 99 శాతం కేసుల్లో మెదడులో వచ్చిన మార్పుల వల్ల ఈ వ్యాధి వస్తుంది. అయితే అల్జీమర్స్ ఒక్కసారిగా వచ్చి మీద పడిపోదు. క్రమేపీ మెదడు పనితీరు దెబ్బ తింటూ ఉంటుంది. ఈ క్రమంలో కనిపించే లక్షణాలను చాలా మంది పట్టించుకోరు. వృద్ధాప్యం వల్ల వచ్చే మతిమరుపు అనుకుని నిర్లక్ష్యం చేస్తారు. బీపీ, మెదడు వాపు వ్యాధి వంటివి వచ్చినప్పుడు సరైన చికిత్స తీసుకోకపోతే వారికి వృద్ధాప్యంలో అల్జీమర్స్ ముప్పు ఉంటుందని లిల్లీ మేరి పేర్కొన్నారు. తగ్గటానికి మందులు అందుబాటులో లేవని, మేనేజ్ చేయడానికి మాత్రమే మందులు ఉపయోగిస్తారని డాక్టర్ లిల్లీ మేరి వివరించారు.

**అల్జీమర్స్ అంటే?**

మనిషి అంటే.. వట్టి శరీరమే కాదు. అనుభవాలు, మేదస్సు, జ్ఞాపకాల సమాహారం. రకరకాల కష్టాలు, ఇబ్బందులను ఎదుర్కొని రాడ్ తేలి విస్తృత అనుభవాన్ని సంపాదించిన ఒక మనిషి. ఆ అనుభవాలను జ్ఞాపకాలను పూర్తిగా మర్చిపోతే! భార్యా పిల్లలను సైతం గుర్తుపట్టలేనంతగా అయిపోతే! సంత పేరు.. ఉండే ఊరు.. చిరునామా.. అన్ని ఆ మెదడు లోంచి కాళీ అయిపోతే? ఆ పరిస్థితిని వైద్య పరిభాషలో అల్జీమర్స్ అంటారు. వయసు పెరిగే కొద్దీ కొందరికి మతిమరుపు రావటం సహజమే. అలాంటివారికి వారు మర్చిపోయిన విషయాన్ని గుర్తు చేస్తే వెంటనే గుర్తొస్తుంది. అల్జీమర్స్ బాధితుల మతిమరుపు అలా కాదు. వారికి ఏదైనా విషయం గుర్తు చేసినా.. మరో నిమిషమే మళ్లీ మర్చిపోతారు. ఒకే విషయాన్ని పదే పదే మాట్లాడతారు. ఒకే ప్రశ్న పదేపదే వేస్తారు. దీనికి కారణం వారి మెదడు సామర్థ్యం క్రమేపి సన్నగిల్లిపోతుండటమే. అల్జీమర్స్ బాధితుల జ్ఞాపక శక్తి నానాటికి తగ్గిపోతుంది. ఆలోచించే సామర్థ్యం నశిస్తుంది. 1906లో జర్మనీకి చెందిన డాక్టర్ అలో ఈజ్ అల్జీమర్స్ అనే వైద్యుడు ఈ వ్యాధిని తొలిసారి గుర్తించారు. అసాధారణ మతిమరుపు, భాషా సమస్యలు అనూహ్య ప్రవర్తనతో బాధపడుతున్న ఒక మహిళ చనిపోయాక ఆమె మెదడుపై పరిశోధన చేశారు. ఆమె మెదడులో అమిలాయిడ్ ప్లేక్స్ ను, నాడులను కప్పివేసినట్లుగా ఉన్న ఫైబర్లను, నాడుల మధ్య అనుసంధానం లేకపోవడాన్ని గుర్తించారు. ఇవే ఆమె సమస్యకు కారణమని గుర్తించారు. అందుకే ఈ వ్యాధికి ఆయన పేరు పెట్టారు అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

**లక్షణాలు ఇవి**

జ్ఞాపకశక్తి నశిస్తుంది. కానీ... బాగా పాత ఘటనలు జ్ఞాపకాలు మాత్రం గుర్తుంటాయి. మాటల్లో తేడా, తడబాటు వస్తాయి. అనర్గళంగా మాట్లాడలేరు. ఒక పదానికి బదులు మరో పదం వాడతారు. ఇప్పుడే జరిగిన ఘటనలను వెంటనే మర్చిపోతారు. బయటకు వెళ్లిన సమయంలో ఇంటిదారి మరచి మరో మార్గంలో వెళ్తారు. ఏకాగ్రత లోపిస్తుంది. తెలియకుండా మూత్ర విసర్జన అయిపోతుంది.

**బీపీతో జరభద్రం**

కొందరికి బీపీ ఎక్కువగా ఉంటుంది. అది మనుషుల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎక్కువ కాలం సరైన చికిత్స చేయించుకోకపోతే.. మెదడులోని రసాయనాల కూర్పులో మార్పులతో అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉంది.

**నిర్ధారణ ఇలా**

ఎమ్మారై, పెట్ స్కానింగ్ ద్వారా దీనిని గుర్తిస్తారు. రక్త పరీక్షలు చేసి కూడా నిర్ధారిస్తారు.

**మెదడుకు పదును.. కంటికి నిద్ర..**

బోర్డు గేములు ఆడటం, సుడోకు, పజిల్స్ వంటి వాటిని పూర్తి చేయడం ద్వారా మెదడును చురుకుగా ఉంచుకోవాలి. దీని వల్ల జ్ఞాపక శక్తికి సంబంధించిన నరాలు నిర్వీర్యం కాకుండా ఉంటాయి. ఇష్టమైన పుస్తకాలు చదవాలి. మానసికంగా, శారీరకంగా చురుగ్గా ఉండాలి. మద్యం పొగ తాగటం మానేయాలి. పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలి. విటమిన్ బి-12 ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. క్యారెట్లు, ఆకుకూరలు, కూరగాయలు విరివిగా తీసుకోవాలి. రాత్రి సమయంలో తప్పనిసరిగా ఎనిమిది గంటలు నిద్రపోవాలి. వ్యాయామం, ధ్యానం, యోగా వంటి నిత్యం చేయాలి. ఉదయం పూట వాకింగ్ చేయడం మంచిది. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాలి. బీపీ, షుగర్, థైరాయిడ్ బి-12 లోపం వంటి సమస్యలు ఉంటే వారిని నియంత్రణలో పెట్టుకోవాలి అని డాక్టర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

**పండ్లు, ఒమేగా-3 ఫ్యా టి యాసిడ్స్**

పండ్లు ఎక్కువగా తినే వారికి అల్జీమర్స్ ముప్పు తక్కువ అని అమెరికాలో ఇటీవల చేసిన ఒక అధ్యయనంలో తేలింది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా తీసుకుంటే అల్జీమర్స్ వచ్చే అవకాశాలు తక్కువ ఉంటాయని నిపుణులు అభిప్రాయం. చేపలు, తృణధాన్యాలు తరచుగా తీసుకుంటే మంచిది అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి తెలిపారు.

# ఏపీని రావణకాష్టం చేస్తున్నారు

**నెల్లూరు:** పిన్నెల్లి మీద అన్యాయంగా కేసులు పెట్టి నిర్బంధించారన్నారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. నెల్లూరు సెంట్రల్ జైలులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. అనంతరం మీడియాతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నిలక సమయంలో పెట్టిన కేసులో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు నెల్లూరు వచ్చారు వైఎస్ జగన్. అయనతో నెల్లూరు సెంట్రల్ జైలులో ములాఖత్ అయిన తరువాత ప్రస్తుత ప్రభుత్వంపై కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నాయకులే తమ పై దాడి చేసి తిరిగి కేసులు పెడుతున్నారన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం, పార్టీ చూడలేదన్నారు వైఎస్ జగన్. రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారని విమర్శించారు. వైయస్ఆర్ విగ్రహాలను తగలబెడుతున్నారని మండిపడ్డారు. ఈ పాపాలన్నీ శిశుపాలుడి పాపాలలా పెరుగుతున్నాయని అభివర్ణించారు. దాడులతో భయపెట్టి చేసే రాజకీయాలు సరికాదని సూచించారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం తమ ధోరణి మార్చుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబుకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి పనులు చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు.ప్రజల్లో వ్యతిరేకతతో వైసీపీ ఓడిపోలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి హామీల వల్లే 10శాతం ఎక్కువ మంది ప్రజలు ఎన్డీయేకు ఓటు వేశారన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.కారంపూడిలో టీడీపీ అకృత్యాలకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబం ఇబ్బంది పడిందన్నారు. డీఎస్పీ అనుమతితో వైసీపీ కార్యకర్తల పరామర్శకు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి వెళ్లారని చెప్పారు. సీఐ నారాయణ స్వామి కనీసం పిన్నెల్లికి ఎదురు పడలేదన్నారు. పిన్నెల్లిపై ఘటన జరిగిన రోజు కేసు పెట్టలేదని తెలిపారు. కారెంపూడి ఘటన తన్వాత వారం రోజులకు పిన్నెల్లిపై 307 సెక్షన్ నమోదు చేశారన్నారు. కారెంపూడి ఘటన జరిగిన 10 రోజుల తర్వాత.. పిన్నెల్లిపై కక్షపూరితంగా హత్యాయత్నం కేసు పెట్టారని చెప్పారు వైఎస్ జగన్. మే17-20 వరకు ఉన్న సిట్ రిపోర్ట్‌లో హత్యాయత్నం కేసు లేదని వివరించారు. పిన్నెల్లి మంచోడు కాబట్టే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని పేర్కొన్నారు. పిన్నెల్లి లాంటి వారిని తప్పుడు కేసులతో నిర్బంధించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రెడ్ బుక్ పేరుతో టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారన్నారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. రాష్ట్రం వ్యాప్తంగా వైసీపీ ఆఫీసులపై దాడులు చేస్తున్నారన్నారు. అన్నింటినీ న్యాయపరంగా అధిగమిస్తామని ధీమాను వ్యక్తం చేశారు.

హడావిడి చేసిన అనిల్

జగన్ కేవలం చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మడం వల్లనే వైసీపీ ఓటమి పాలయిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ విధ్వంసాలకు దిగుతుందని వైసీపీ క్యాడర్‌ను, నేతలను భయాందోళనలకు గురి చేయాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎవరిస్థాయిలో వాళ్లు రెడ్ బుక్ ను పెట్టుకుని ఉన్నారన్నారు. ప్రతి వైసీపీ కార్యకర్త ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. దొంగకేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో వైసీపీ పరిపాలనలో అన్ని వర్గాల వారికి పథకాలను అందించామన్నారు. కేవలం టీడీపీకి ఓటు వేయలేదన్న కారణంతో ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి రాజకీయాలు నిలబడవన్నారు. ఈవీఎంలనుపగుల గొట్టిన కేసులో పిన్నెల్లిని అరెస్టు చేయలేదని జగన్ తెలిపారు. అన్యాయం జరుగుతోందని తెలిసి అడ్డుకునే ప్రయత్నం చేశారని కోర్టు గుర్తించే బెయిల్ ఇచ్చిందన్నరు. ఆ ఇన్సిడెంట్ జరిగిన తర్వాత పదిరోజుల తర్వాత హత్యాయత్నం చేశాడని కేసు పెట్టారన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన జగన్ కు స్వాగతం చెప్పడానికి స్థానిక నేతలు జన సమీకరణ చేశారు. నర్సరావుపేట నుంచి పోటీ చేసినా మాజీ మంత్రి అనిల్ ఎక్కువగా హడావుడి చేశారు. దీంతో కొంత మంది సీనియర్ నేతలు జగన్ పర్యటనపై పెద్దగా ఆసక్తి చూపలేదు.

# వైసిపి మాజీ ఎంఎల్ఏ సుధాకర్‌పై పోక్సో కేసు



వైసిపి నేత, కోడుమూరు మాజీ ఎంఎల్ఏ జరదొడ్డి సుధాకర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో తన ఇంట్లో పనిచేసే బాలికపై లైంగిక్ వేధింపులకు పాల్పారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా గురువారం కర్నూలు లోని నివాసంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంత్రం సుధాకర్‌ను వైద్యపరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. జరదొడ్డి సుధాకర్ తన ఇంట్లో పనిచేసే బాలికతో గతంలో అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించిన ఓ వీడియో ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటనపై ఇటీవల పోలీసులు సుధాకర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తాజాగా అరెస్ట్ చేశారు. ఇదిలాఉంటే సుధాకర్ 2019 ఎన్నికల్లో వైసిపి తరపున కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే, 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కలేదు. ఆయన స్థానంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ సోదరుడు సతీష్‌కు టికెట్ దక్కింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com